మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్‌గా బల్లా పల్లవి



బల్లా పల్లవి

అనంతపురం రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్‌గా బల్లా పల్లవి నియమితులయ్యారు. నూతన కమిటీకి సంబంధించిన జాబితా బుధవారం విడుదలైంది. వైస్ చైర్మన్‌గా మహమ్మద్ అర్షదుల్లా, సభ్యులుగా జాంబవంతుడు, బోయపాటి బాలప్ప, రవికుమార్, దళవాయి మారెక్క, లక్ష్మిదేవి, లావణ్య, మంజుల, కంతాదేవి, విజయకుమార్, క్రిష్ణ, వెంకటేష్, లక్ష్మీరమణమ్మ, శాంతి సుధ నియమితులయ్యారు.

ఏసీబీ ఇన్ఫార్మర్‌ను మాట్లాడుతున్నా.. రూ.లక్ష ఇవ్వాల్సిందే..!

అనంతపురం ఏడీఏకి బెదిరింపులు

- పోలీసులకు ఫిర్యాదు
- గార్లదిన్నె మండలం కోటంకకు చెందిన సురేష్ అరెస్టు

అనంతపురం అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తాను ఏసీబీ ఇన్ఫార్మర్‌నంటూ బెదిరింపులకు దిగాడు గార్లదిన్నె మండలం కోటంకకు చెందిన సురేష్. ఏకంగా ఏసీబీ సీఐ హమీద్ ఖాన్ ఫొటోను వాట్సాప్ డీపీగా పెట్టుకుని.. దందాకి తెర లేపాడు. వ్యవసాయ శాఖ అనంతపురం ఏడీ అల్తాఫ్ అలీఖాన్‌ను బెదిరించాడు. ఈనెల 6వ తేదీన ఏడీఏకి ఫోన్ చేసి, తాను ఏసీబీ ఇన్ఫార్మర్‌నంటూ పరిచయం చేసుకున్నాడు. 'నువ్వు ఏం ఏం చేస్తున్నావో అన్నీ తెలుసు... ఎస్ఆర్ ఫర్టిలైజర్స్ కేసులో డబ్బు తీసుకుని సీజ్ చేసిన మూడు ఆటోలను వదిలేశావ్.. డబ్బు ఇవ్వకపోతే ఏసీబీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తా'నం'టూ ఏడీఏను బెదిరించాడు. నిబంధనల మేరకు 6ఏ కేసు నమోదు చేశామనీ... ఆటోలు ఇంకా రిలీజ్ కాలేదని ఏడీఏ సమాధానం చెప్పగా... ఆటోలను వదిలి పెట్టలేదా అంటూ దబాయించాడు. ఆటోల రిలీజ్ అంశం కోర్టు పరిధిలో ఉందని ఏడీఏ చెప్పగా... అంతా తనకు తెలుసుననీ, ఎస్ఆర్ ఫర్టిలైజర్స్‌పై మళ్లీ తనిఖీలు చేయాలని రుబాబు ప్రదర్శించాడు. 'నీవు ఏం చేస్తున్నావో.. అన్నీ నాకు తెలుసు. రూ.లక్ష డబ్బు ఇస్తే సరి.. లేదంటే వ్యవసాయ శాఖ కమిషనర్, జేడీఏ, ఏసీబీ అధికారులకు నీ గురించి ఫిర్యాదు చేస్తా' అని బెదిరించాడు. ఇలా రోజూ వాట్సాప్ కాల్స్ చేస్తూ బెదిరిస్తూనే ఉన్నాడు. దీంతో విసిగిపోయిన ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్, బుధవారం ఉదయం టూటౌన్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి, సీఐ శ్రీకాంత్ యాదవ్‌కు ఫిర్యాదు చేశాడు. సీఐ.. సిబ్బందిని పంపి నిందితుడిని అరెస్టు చేశారు. ఏడీఏ విధులకు ఆటంకం కలిగించడం, బెదిరించడంపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.




అనంతపురం ఏడీఏను వాట్సాప్ కాల్ ద్వారా బెదిరించిన సురేష్ (ఫైల్)

ఆది నుంచీ వివాదాస్పదుడే...!

సురేష్ ఆది నుంచీ వివాదాస్పదుడిగా పేరు పొందాడు. నాలుగేళ్ల క్రితం ఓ ప్రైవేటు పురుగుల మందుల కంపెనీలో పనిచేసేవాడు. రైతుల నుంచి డబ్బు తీసుకుని, డీలర్లకు చెల్లించకపోవడంతో అతడిని తొలగించినట్లు సమాచారం. ఆ తర్వాత ఓ ఎరువుల దుకాణంలో పనిచేశాడు. అక్కడ పలు వివాదాలతో దుకాణ యజమాని.. అతడిని బయటకు పంపినట్లు తెలిసింది. డబ్బుల కోసం ఓ డీలర్, పలువురిని బెదిరించినట్లు ఆరోపణలున్నాయి. అతడిపై గతంలో గార్లదిన్నె పోలీసు స్టేషన్‌లో ఓ కేసు నమోదైనట్లు తెలిసింది. ప్రస్తుతం అనంతపురంలో అతడు నివాసం ఉంటున్నాడు.

వాట్సాప్ డీపీలో ఏసీబీ సీఐ హమీద్ ఖాన్ ఫొటోను పెట్టుకున్న దృశ్యం



అసలా.. నకిలీనా?

- తాకట్టు బంగారంపై బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల అనుమానం
- పోలీసుల అదుపులో నకిలీ బంగారం కుదువపెట్టే ముఠా
- గోరంట్ల, ఓడీసీ ఘటనలతో ఉలిక్కిపడ్డ బ్యాంకర్లు



ఓడీసీ బ్యాంక్‌లో కుదువ పెట్టిన నకిలీ బంగారం వడ్డాణం

హిందూపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తాము తాకట్టు పెట్టుకున్నది మేలిమి బంగారమేనా అనే అనుమానాలు ప్రస్తుతం బ్యాంకర్లు, గోల్డ్ ఫైనాన్స్ సంస్థల నుంచి వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల శ్రీ సత్యసాయి జిల్లాలోని కొన్ని బ్యాంకుల్లో కర్ణాటకకు చెందిన ఓ ముఠా కొందరు రైతులకు కమీషన్ ఆశ చూపి వారి పేరుపై నకిలీ బంగారం కుదువపెట్టి, డబ్బులు తీసుకెళ్లారు. ఈ బాగోతం మంగళవారం గోరంట్ల, ఓడీసీలో జరిగిన ఘటనలతో వెలుగులోకి వచ్చింది. దీంతో బ్యాంకర్లు, గోల్డ్ ఫైనాన్స్ సంస్థలు తమ వద్ద ఉన్న తాకట్టు బంగారంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. కాగా నకిలీ బంగారం ముఠా పోలీసుల అదుపులో

(మిగతా 8వ పేజీలో..)

నకిలీ బంగారంతో బ్యాంకర్లకు బురిడీ

- భారీగా బంగారం రుణాలు తీసుకున్న ముఠా
- మరోమారు ప్రయత్నించి దొరికిపోయిన వైనం
- పోలీసుల అదుపులో కర్ణాటక ముఠా, స్థానిక రైతులు



(వివరాలు మెయిన్‌లో)

రుచిలేని చేప

కాలుష్యపు కోరల్లో శింగనమల చెరువు

- ఇక్కడి చేపలకు తగ్గిన డిమాండ్
- ఇబ్బంది పడుతున్న మత్స్యకారులు

శింగనమల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శింగనమల శ్రీరంగరాయని చెరువు కాలుష్య కోరల్లో చిక్కుకుంది. చెరువులోని నీరు కలుషితమవడంతో ఇక్కడ పెరిగే చేపలకు రుచి లేకుండాపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎగువ ప్రాంతం నుంచి కలుషితమైన నీరు శింగనమల చెరువుకు వస్తోంది. దీంతో జల చరాలు, వాటిపై ఆధారపడ్డ మత్స్యకార కుటుంబాలకు ఇబ్బంది కలుగుతోంది. శింగనమల చెరువు 3వేల ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇక్కడ మత్స్యకార సొసైటీ కూడా ఉంది. ఈ చెరువుపై ఆధారపడి 300దాకా మత్స్యకార కుటుంబాలు జీవిస్తున్నాయి. ఇక్కడ అన్ని రకాల చేపలు బాగా పెరుగుతాయి. పదేళ్ల కిందటి వరకు ఇక్కడి చేపలు రుచిగా ఉండటంతో మంచి డిమాండ్ ఉండేది. గత దశాబ్ద కాలం నుంచి చెరువులోకి కలుషిత నీరు రావడంతో పరిస్థితి మారింది. చెరువులో పట్టిన చేపలను అమ్మడానికి మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక మత్స్యకారులు చేపలు పట్టగానే వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముతున్నారు. ఎగువప్రాంతం నుంచి ముఖ్యంగా అనంతపురం నుంచి కలుషితనీరు చెరువులోకి రాకుండా ఉంటేనే తమ జీవితాలు బాగుపడతాయని పలువురు మత్స్యకారులు పేర్కొన్నారు.

శింగనమల చెరువు





వేటకు వెళ్లడానికి సిద్ధం చేసుకున్నబోట్లు



ఎగబడి కొనేవారంట..

గత 15 ఏళ్ల కిందట మా చెరువులో పట్టిన చేపలను గంపలో వేసుకుని పోతే, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు శింగమల చెరువు చేపలు వచ్చాయని ఎగబడి కొనేవారని మా అమ్మ ఇప్పటికీ చెబుతుంది. ప్రస్తుతం చెరువులో నీరు కలుషితమవడంతో చేపల రుచి తగ్గిపోయింది. చేపలు అమ్మడాని పోతే కొనేవాళ్లే లేరని మా అమ్మ ఆవేదనగా చెబుతుంది. శింగనమల చెరువు చేపలా... వద్దులే.. రుచి ఉండవని మొహంమీదే అంటారని బాధపడుతూ చెబుతుంది. రోజంతా తిరిగినా 20కిలోలు కూడా అమ్ముడుపోని పరిస్థితి.

- బెస్త హరీష్, మత్స్యకారుడు



అడిగిన ధరకు ఇచ్చేస్తున్నాం

గత 20 సంవత్సరాల నుంచి కైకలూరు నుంచి చేప పిల్లలు తెచ్చి చెరువులో పెంచుతున్నాం. మొదట్లో బాగానే ఉండేది. చేప పిల్లలు కూడా బాగా వృద్ధి చెందేవి. అయితే గత కొన్నేళ్లుగా చెరువు కలుషితమవడంతో చేపలు నల్లగామారి, రుచి తగ్గింది. దీంతో డిమాండ్ లేక ఇతర రాష్ట్రాల వ్యాపారులు అడిగిన ధరకు ఇచ్చేస్తున్నాం.

- బెస్త వెంకటనారాయణ, శింగనమల మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు



నీటి కాలుష్యాన్ని నివారించాలి

వర్షాలు వచ్చినప్పుడు చెరువు ఎగువ ప్రాంతం అనంతపురంలోని డ్రైనేజ్ నీరు మొత్తం శింగనమల చెరువులోకి వస్తోంది. ఆనీటిలో పెరిగే చేపలు రుచిగా ఉండటం లేదని పలువురు చెబుతున్నారు. గత పదేళ్ల నుంచి ఈ పరిస్థితి దాపురించింది. మాకు ఉపాధి మార్గం ఇదే కావడంతో చేపల వేట కొనసాగిస్తున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు కాలుష్యం నీరు శింగనమల చెరువుకు రాకుండా చూడాలి.

- బెస్త ప్రసాద్, మత్స్యకారుడు

నేడే ఎన్నిక

టీడీపీ వశం కానున్న దుర్గం మున్సిపల్ చైర్మన్ పదవి?

సైకిల్ పార్టీకి వైసీపీ కౌన్సిలర్ల మద్దతు?

కళ్యాణదుర్గం, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గం మున్సిపల్ చైర్మన్ ఎన్నిక గురువారం నిర్వహించనున్నారు. ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి, ఆర్డీవో వసంతబాబు ఎన్నికకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఎన్నిక జరగనుంది. 24 మంది కౌన్సిలర్లు చేతు లెత్తే విధానం ద్వారా చైర్మన్‌ను ఎన్నుకుంటారని అధికారులు చెబుతున్నారు. మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, డీఎస్పీ రవిబాబు ఆధ్వర్యంలో కూడా ప్రత్యేకంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. మున్సిపల్ కార్యాలయం నుంచి 400 మీటర్ల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

టీడీపీకే పీఠం?

మున్సిపల్ చైర్మన్ కుర్చీ టీడీపీకి కైవసం కాబోతున్నట్లు తెలుస్తోంది. విధుల్లో నిర్లక్ష్యం వహించారని గత మున్సిపల్ చైర్మన్ తలారి రాజ్‌కుమార్‌ను ప్రభుత్వం పదవి నుంచి తొలగించిన విషయం తెలిసిందే. దీంతో మిగిలిన మూడు నెలల కాలానికి నూతన చైర్మన్ ఎన్నిక అనివార్యమైంది. మున్సిపాలిటీలో మొత్తం 24 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో 13 మంది వైసీపీ వర్గీయులు, 11 మంది టీడీపీ వర్గీయులు ఉండేవారు. అయితే ఎక్స్ అఫీషియో హోదాలో ఎమ్మెల్యే, ఎంపీలకు ఈ మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో పాల్గొని ఓటు వేసే హక్కు ఉంది. మంగళవారం వైసీపీ మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణీంద్ర టీడీపీలోకి చేరారు. దీంతో టీడీపీ బలం 14కు చేరింది. వైసీపీకి మిగిలిన 12 మంది కౌన్సిలర్లలో కూడా మరో ముగ్గురు టీడీపీకి మద్దతు ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చేస్తున్న అభివృద్ధిని చూసే వైసీపీ కౌన్సిలర్లు కూడా మద్దతు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నట్లు ఆయా వర్గాలు చెబుతున్నాయి.

నేడు ఎంపీపీ ఎన్నిక

ఏర్పాట్లు పూర్తి

ఎన్నిక లాంఛనమేనా..?



ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసులు, ఎంపీడీఓ

రామగిరి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రామగిరి ఎంపీపీ ఎన్నికను గురువారం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల అధికారి సంజీవయ్య, ఎంపీడీఓ గంగావతి, సీఐ శ్రీధర్, ఎస్ఐ సుధాకర్‌యాదవ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. బారికేడ్లు ఏర్పాటు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా వాహనాల తనిఖీలు చేపట్టారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందని అధికారులు ప్రకటించారు. కాగా, ఎంపీపీ ఎన్నిక లాంఛమేనని తెలుస్తోంది. ఇప్పటికే వైసీపీకి చెందిన ఎంపీటీసీలు ఎన్నికలను బహిష్కరిస్తున్నట్టు ఆ పార్టీ నాయకులు ప్రకటించారు. ఎంపీపీ అభ్యర్థి మహిళకు రిజర్వు కావడంతో టీడీపీలోకి చేరిన కుంటిమద్ది ఎంపీటీసీ కప్పల సాయిలీల ఎంపీపీగా ఎన్నికయ్యే అవకాశం ఉంది. ఆమె మంగళవారం టీడీపీలోకి చేరుతున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ఆమె ఎంపీపీగా ఎన్నికయ్యే అవకాశం ఉంది. మొత్తం 10 ఎంపీటీసీలు ఉండగా.. ఎంపీపీగా ఉన్న మీనిగ నాగమ్మ మృతి చెందడంతో 9 మంది ఉన్నారు. వీరిలో ఇప్పటికే ఇద్దరు టీడీపీలోకి, ఒకరు జనసేన పార్టీలోకి చేరారు. మరొకరు టీడీపీ ఎంపీటీసీ ఉన్నారు. గురువారం ఈ ఎన్నికకు నలుగురు సభ్యులు హాజరైతే ఎంపీపీ ఎన్నిక లాంఛనంగా జరిగిపోతుంది. ఉదయం 10 గంటల నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుందని అధికారులు తెలిపారు.

టెట్ ప్రారంభం

తొలిరోజు 74మంది గైర్హాజరు

అనంతపురం విద్య, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (టెట్) బుధవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో ఏడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. తొలిరోజు నాలుగు సెంటర్లలో మాత్రమే పరీక్షలు కొనసాగాయి. అందులో అనంతలక్ష్మి, గుత్తి గేట్స్, సీవీ రామన్, తాడిపత్రి ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం జరిగాయి. మొత్తం 940 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా.. 866 మంది రాశారు. 74 మంది గైర్హాజరైనట్లు డీఈఓ ప్రసాద్‌బాబు, ఏడీ శ్రీనివాసులు తెలిపారు.

తహసీల్దార్లు కావలెను..!

- ఎక్కడి సమస్యలు అక్కడే
- జిల్లాలో ఐదు మండలాల్లో ఇన్‌చార్జ్‌ల పాలన
- అనంత తహసీల్దార్ దీర్ఘకాలిక సెలవు
- భూసమస్యలపై ప్రజలకు తిప్పలు
- పనుల కోసం పైసలు


8



వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

- విద్యార్థులకు కలెక్టర్ ఆనంద్ సూచన
- ఉపాధ్యాయుడిగా మారి బోధన

గుంతకల్లు టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. స్థానిక సరోజిని నాయుడు మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం కలెక్టర్ తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థినులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు వంద రోజుల యాక్షన్ ప్లాన్ రూపొందించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థినులు గణితంలో ఏ స్థాయిలో విద్యా బోధన పొందారని పరిశీలించారు. లెక్కల్లో త్రికోణమితి చాప్టర్‌లోని సైన్‌టీటా లెక్కను చేయాలని విద్యార్థినులకు ఇచ్చారు. తర్వాత ఆయనే స్వయంగా బోర్డు మీద చేసి చూపించారు. అనంతరం పాఠశాలలో వంట గది, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ రమాదేవి, కమిషనర్ నయీమ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడిగా మారిన కలెక్టర్ ఆనంద్

డీఆర్ఎంతో కలెక్టర్ భేటీ

స్థానిక రైల్వే డివిజన్ కార్యాలయంలో డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తాతో కలెక్టర్ ఆనంద్ భేటీ అయ్యారు. ఉద్యాన పంటల ఎగుమతులపై చర్చించారు. తాడిపత్రి నుంచి ఢిల్లీ మార్కెట్, ముంబై పోర్టులకు నిరంతరం సరుకు రవాణా రైలును నడపాలని తెలిపారు. జిల్లాలో 72,018 హెక్టార్లలో చీనీ, అరటి, మామిడి, దానిమ్మ, పుచ్చకాయ, తదితర ఉద్యాన పంటలు పండిస్తున్నారని అన్నారు. దాదాపు రూ.3,470 కోట్ల విలువైన 10.70 టన్నుల పండ్ల ఉత్పత్తులు ఉత్తరాదికి ఎగుమతి అవుతున్నాయన్నారు. ఇవి కాక జిల్లాలో దాదాపు 1.10 లక్షల హెక్టార్లలో వివిధ రకాల పూలు, సుగంధ ద్రవ్యాలు, కూరగాయలను పండిస్తారన్నారు. ఈ ఉత్పత్తుల ఎగుమతికి తాడిపత్రి నుంచి సంవత్సరం పొడవునా ఏసీ సరుకు రవాణా రైలును నడపాలన్నారు. దీనిపై డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా సమాధానమిస్తూ.. ఎగుమతి, కొనుగోలుదార్లతో సమావేశాన్ని ఏర్పాటుచేసి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని తెలిపారు.



డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తాతో సమావేశమైన కలెక్టర్ ఆనంద్

వీడు మామూలోడు కాదు..!



పాత చోరీ కేసులను ఛేదించే క్రమంలో హిందూపురం పోలీసులు ఓ ఘరానా దొంగను పట్టుకున్నారు. కేవలం 39 ఏళ్ల వయసుకే ఏపీ, కర్ణాటకలోని పలు ప్రాంతాలలో ఏకంగా 55 దొంగతనం కేసులు ఉన్నాయి అతనిపై..! పేరు బండికాళ్ల రత్నరాజు అలియాస్ తేజ..! చుట్టూ పది మంది కాపలా ఉన్నా.. ఇంట్లోకి చొరబడి లూటీ చేయగల ఇలాంటి దొంగను తమ సర్వీసులో చూడలేదని పోలీసులు అంటున్నారంటే.. అతని నేర 'ఘనత' ఏ స్థాయిదో తెలుసుకోవచ్చు. 'పది మంది ముఠాతో వెళ్లినా.. ఒక్కడే ఇంట్లోకి చొరబడుతాడు. ఎత్తుకొచ్చిన సొమ్ములో కొంత బయట ఉన్నవారికి ఇస్తాడు. ఎక్కువ భాగం తానే తీసుకుంటాడు..! కష్టానికి తగ్గ ఫలితం మరి..! వీడు మామూలోడు కాదు..' అని పోలీసులు అంటున్నారు. చోరీ సొమ్ముతో గుంటూరులో రూ.2 కోట్లు వెచ్చించి రెండు ఇళ్లను నిర్మిస్తున్నాడని పోలీసులు గుర్తించారు. ఆ ఘరానా దొంగల వివరాలు.. 9లో..

నేడే సీపీఐ వందేళ్ల వేడుకలు

- ఉద్యమ కుటుంబాలకు సత్కారం
- కేంద్ర, రాష్ట్ర నేతలు రాక
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్

9

ఈఎస్ఐ ఆస్పత్రిలో ఇద్దరే..!

- తాడిపత్రిలో అధ్వానం
- వైద్యుడు, అటెండరే దిక్కు
- మందులుకూడా లేని దుస్థితి
- కార్మికులకు తప్పని తిప్పలు

9

ఏమీ పట్టదా..?

- పొదుపు సొమ్ములో కొందరు సీసీల చేతివాటం
- అవినీతి తేలినా రికవరీ, చర్యలు శూన్యం
- మహిళా సంఘాల డబ్బులు రూ.లక్షల్లో మాయం
- ఓ అధికారి అండతోనే చర్యలు శూన్యం

పుట్లూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అవినీతి తేలినా రికవరీ లేదు. చర్యలు అసలే లేవు. దీంతో కొందరు ఐకేపీ సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని వెలుగు కార్యాలయంలో కొందరు సీసీలు, యానిమేటర్ల అవినీతికి అంతే లేకుండా పోయింది. మహిళలు సంఘాలకు ప్రతి నెలా పొదుపు చేసే సొమ్మును బ్యాంకుల్లో జమ చేయకుండా సొంత అవసరాలకు వాడుకుంటున్నారు.

- వైసీపీ పాలనలో బాలాపురంలోని గంగాభవాని గ్రామ సంఘంలో సుమారు రూ.5లక్షలు తేడా వచ్చినట్లు ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులతో విచారణకు ఆదేశించారు. అప్పట్లో ఏరియా కో ఆర్డినేటర్ రాజ్యలక్ష్మి విచారించారు. విచారణలో రూ.1.76లక్షలు అవినీతి జరిగినట్లు నిర్ధారించారు. ఆ మొత్తం రికవరీకి ఆదేశించారు. కానీ ఆ సీసీ ఓ అధికారి అండతో రూ.36వేలు మాత్రమే చెల్లించి చేతులు దులుపుకున్నట్లు సమాచారం. ఆ పంచాయతీలోనే గత టీడీపీ ప్రభుత్వంలో మహిళా సంఘాలకు వచ్చిన సుమారు రూ.50వేలు నిధులను ఇవ్వకుండా ఓ సీసీ కాజేసినట్లు తేల్చారు. కానీ వాటిలో కూడా ఆ సీసీ చక్రం తిప్పి ఎలాంటి రికవరీ లేకుండా చేసుకున్నట్లు తెలిసింది.
- కడవకల్లులో సుమారు రూ.1.3లక్షలు తేడా రావడంతో విచారణ చేశారు. కానీ అప్పట్లో ఆ సొమ్మును సంఘంలోని మహిళలే చెల్లించేలా సీసీ, యానిమేటర్ చక్రం తిప్పారు.
- పుట్లూరులోని ఓ సంఘంలో రూ.5లక్షలు మాయంకాగా సంఘం సభ్యులు అంతా స్థానిక వెలుగు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఆ సొమ్ము ఎవరు కాజేశారు, ఎవరి హస్తం ఉందని విచారణకు ఆదేశించినా ఎలాంటి ఫలితం లేదు. సీసీలను మందలించి వదిలేశారన్న విమర్శలు ఉన్నాయి. మండల వ్యాప్తంగా సీసీలు ఇలాంటి ఆరోపణలు ఎదుర్కొంటున్నా ఉన్నతాధికారులు మాత్రం పట్టించుకున్న పాపాన పోలేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో ఎన్నో ఆరోపణలు ఎదుర్కొన్న సీసీలు రికవరీ సొమ్ము చెల్లించకుండానే ప్రస్తుతం మండలానికి బదిలీపై వచ్చి తమ హవా కొనసాగిస్తున్నారు. ఈ విషయంపై ఐకేపీ ఏపీఎం వెంకటరామిరెడ్డిని వివరణ కోరగా విషయం ఉన్నతాధికారుల దృష్టిలో ఉందన్నారు.



పుట్లూరు ఐకేపీ కార్యాలయం

రాజ్యాంగంతోనే స్థిరత్వం

మానవహక్కుల వేదిక రాష్ట్ర నాయకుడు చంద్రశేఖర్



మాట్లాడుతున్న చంద్రశేఖర్

అనంతపురం ప్రెస్ క్లబ్, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): సమర్థవంతమైన రాజ్యాంగంతోనే దేశంలో స్థిరత్వం ఉంటుందని మానవహక్కుల వేదిక రాష్ట్ర నాయకుడు చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఎస్కేయూలోని న్యాయశాస్త్ర విభాగంలో జనవిజ్ఞాన వేదిక కమిటీ ఆధ్వర్యంలో రాజ్యాంగాన్ని అర్థం చేసుకుందాం - కాపాడుకుందాం అనే అంశంపై బుధవారం సదస్సు నిర్వహించారు. ఆ కమిటీ జిల్లా ప్రధానకార్యదర్శి వీరరాజు అధ్యక్షతన జరిగిన సదస్సుకు చంద్రశేఖర్‌తో పాటు మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం రూపొందించుకోవడానికి ముందు ఒక సుదీర్ఘమైన స్వాతంత్ర్య పోరాటం జరిగిందన్నారు. రాజ్యాంగం అంటే ప్రజలని, రాజ్యాంగం గురించి తెలుసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ మాట్లాడుతూ దేశం లో నివసిస్తున్న ప్రజలందరికీ భావ ప్రకటన స్వేచ్ఛ రాజ్యాంగం ద్వారానే వచ్చిందన్నారు. రాజ్యాంగం పట్ల అవగాహన ఉన్నప్పుడే దేన్నైనా ప్రశ్నించగలుగుతామన్నారు. అందుకే ప్రతిఒక్కరూ రాజ్యాంగాన్ని అధ్యయనం చేయడమే కాక అర్థం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఈ నెల 14న ఆర్ట్స్ కళాశాలలో జరగనున్న హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. సదస్సులో న్యాయశాస్త్ర విభాగం కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రీరాములు, అధ్యాపకులు హుస్సేని, జేవీవీ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్, నగర అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్‌రెడ్డి, తిరుపాల్, కోశాధికారి రామిరెడ్డి, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

డివిజన్ మీదుగా ప్రత్యేక రైలు



గుంతకల్లు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రైల్వే డివిజన్ మీదుగా ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. చర్లపల్లి-యల్హంక ప్రత్యేక రైలు (07159) ఈ నెల 24, 29 తేదీల్లో చర్లపల్లిలో రాత్రి 10 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 11-45 గంటలకు యల్హంకకు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (07160) ఈ నెల 25, 30 తేదీల్లో మధ్యాహ్నం 1 గంటలకు యల్హంకలో బయలుదేరి మరుసటిరోజు తెల్లవారుజాము నాలుగున్నరకు చర్లపల్లికి చేరుతుందన్నారు. ఈ రైలు కాచిగూడ, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, గద్వాల, కర్నూలు సిటీ, డోన్, గుత్తి, అనంతపురం, ధర్మవరం, శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం, హిందూపురం స్టేషన్ల మీదుగా యల్హంకకు చేరుకుంటుందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శింగనమల, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): మండలంలోని శివపురం పెద్దమ్మ అమ్మవారి ఆలయ నూతన ధర్మకర్తల మండలి కమిటీ ఏర్పాటు కోసం భక్తులు దరఖాస్తు చేసుకోవాలని ఆలయ కార్యనిర్వహణాధికారి జి.రంగస్వామి నాయుడు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు దేవాదాయ కమిషనర్ నోటిఫికేషన్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ధర్మకర్తల మం డలి కమిటీలో 9 మంది సభ్యుల్లో ఐదుగురు మహిళలు ఉండేలా ఎంపిక ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 30 తేదీ లోపు అనంతపురం జిల్లా దేవాదాయశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

- వైసీపీ కూల్చివేతపై రెండేళ్ల తర్వాత చర్యలు
- కేసు నమోదైన ఆరు నెలలకు బోర్డు ఏర్పాటు



పశువుల ఆస్పత్రి స్థలంలో బోర్డు నాటిన అధికారులు



పశువుల ఆస్పత్రిని కూల్చేసిన దృశ్యం (ఫైల్)

బొమ్మనహాళ్, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి) వైసీపీ హయాంలో జరిగిన అక్రమ వ్యవహారాలపై కేసులు నమోదవుతున్నాయి. అధికారం అండతో ప్రభుత్వ భవనాన్ని కూల్చి, ఆ స్థలంపై హక్కులు పొంది, మరొకరి పేరుపై కణేకల్లు రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించారు. ప్రభుత్వం మారిన తర్వాత ఈ బాగోతం వెలుగులోకి వచ్చింది. మండలంలోని గోవిందవాడ గ్రామంలో పశువైద్యశాల భవనం నిర్మాణం కోసం 2000లో బళ్లారి సిద్దమ్మ గ్రామంలోని 170సి సర్వే నంబర్‌లో 3 సెంట్లు స్థలం ప్రభుత్వానికి ఇచ్చింది. 2001లో అప్పటి ఎంపీ కాలవ శ్రీనివాసులు, రాయదుర్గం ఎమ్మెల్యే పాటిల్ వేణుగోపాల్‌రెడ్డి పశువైద్యశాల భవనం ప్రారంభించారు. అయితే భవనం శిథిలావస్థకు చేరిందని వైసీపీ పాలనలో 2023లో కూల్చివేశారు. ఆ స్థలాన్ని మరొకరికి రిజిస్ట్రేషన్ చేయించి కొందరు వైసీపీ నాయకులు సొమ్ము చేసుకున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొందరు గ్రామస్థులు విషయాన్ని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి ఆదేశాలు రావడంతో పశువైద్యాధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. భవనాన్ని కూల్చిన రెండేళ్ల తర్వాత గ్రామానికి చెందిన శరణబసవ, చిదానందలపై కేసు నమోదు అయ్యింది. తర్వాత ఆరు నెలలకు అక్కడ బోర్డు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ మునివేలు, పశువైద్యాధికారి వెంకటరెడ్డి, ట్రైనీ ఎస్ఐ నవీన్ బుధవారం బోర్డు ఏర్పాటు చేయించారు. స్థలం స్వాధీనం చేసుకోనేందుకు ఇన్ని రోజులు సమయం పట్టిందా అని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ స్థలంపై హక్కులు కల్పించిన రెవెన్యూ అధికారులపై చర్యలు ఏవి అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

దుర్గం అభివృద్ధికి రూ.23 కోట్లు

- విప్ కాలవకు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి హామీ



మంత్రి నారాయణతో విప్ కాలవ

రాయదుర్గం రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణ అభివృద్ధి, మురుగునీటి కాలువల నిర్మాణానికి రూ.23 కోట్ల మంజూరు చేస్తానని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే, విప్ కాలవ శ్రీనివాసులు ఒక ప్రటనలో తెలిపారు. అమరావతిలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో బుధవారం సాయంత్రం మంత్రితో భేటీ అయినట్లు విప్ తెలిపారు. పట్టణాభివృద్ధికి రూ.50 కోట్లు మంజూరు చేయాలని 2024 నవంబరు 30న నేమకల్లులో నిర్వహించిన ప్రజావేదికలో ముఖ్యమంత్రి చంద్రబాబును కోరినట్లు తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో దశలవారీగా ఈ నిధులు మంజూరు చేయడానికి సీఎం నాడు అంగీకరించారని తెలిపారు. ఈ నేపథ్యంలో మంత్రి నారాయణను బుధవారం కలవగా.. సీఎం హామీలో భాగంగా రూ.23 కోట్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు విప్ వివరించారు.

అసలా.. నకిలీనా?



స్టేట్ బ్యాంకు గోరంట్ల శాఖ కార్యాలయం

(7 పేజీ తరువాయి)

ఉంది. వీరి నుంచి జరిగిన మోసాలపై ఆరాతీస్తున్నారు.

రూ.రెండు కోట్ల దాకా..

కర్ణాటక రాష్ట్రం యల్హంకకు చెందిన ఓ ముఠా గత కొంత కాలంగా నకిలీ బంగారం తీసుకొచ్చి జిల్లాలోని పలుచోట్ల బ్యాంకుల్లో కుదువపెట్టి డబ్బును తీసుకెళ్తోంది. వీరు పది తులాల నకిలీ బంగారం తీసుకొస్తే అందులో రెండు తులాల మేలిమి బంగారం ఉంటుంది. వారు తయారుచేసిన వస్తువులకు బంగారుపూత పూసి లోపల మైనం లేదా ఇతర లోహాలు కలిపి ఉంచుతారు. బ్యాంకు లేదా గోల్డ్ ఫైనాన్స్‌లలో బంగారమా కాదా అనిచూసేది పైన మాత్రమే. అయితే ఎక్కడా అనుమానం రాకుండా వస్తువులు నాలుగు వైపులా బంగారు పూత ఉంటుంది. దీంతో ఎవరూ అనుమానించేందుకు వీలుండదు. దీంతో ఈ ముఠా ఇప్పటి వరకు జిల్లాలో రూ.2కోట్ల దాకా నకిలీ బంగారం తాకట్టుపెట్టి నగదు తీసుకున్నట్లు సమాచారం.

కమీషన్ మాట్లాడుకుని...

కర్ణాటకకు చెందిన వ్యక్తులు జిల్లాలోని కొంతమందితో పరిచయం పెంచుకుంటారు. తర్వాత అత్యవసరం ఉందని, మీ పేరుపై తమ బంగారాన్ని బ్యాంకులో కుదువ పెడతామని అడుగుతారు. ఇందుకు కమీషన్ కూడా ఇస్తామని చెబుతారు. దీంతో కమీషన్‌కు ఆశపడిన కొందరు తమ పేరుపై ఆ నకిలీ బంగారాన్ని కుదువపెట్టి నగదు దుండగుల చేతికి ఇస్తారు. ఉదాహరణకు రూ.10లక్షలు విలువ చేసే సొమ్ము పెడితే పెట్టిన వ్యక్తికి రూ.20వేల నుంచి రూ.30వేలు ఇస్తారు. లేదా ఆ ప్రాంతంలోని వ్యక్తులు డబ్బులు అవసరమని చెబితే మీపేరుమీదే బంగారం కుదువుపెట్టి ఇస్తామని రూ.లక్ష అవసరం ఉంటే రూ.10లక్షలు సొమ్ము పెట్టి అతనికి రూ.లక్ష ఇచ్చి మిగిలిన రూ.9లక్షలు ముఠా సభ్యులు ఎత్తుకెళ్తారు.

పోలీసుల అదుపులో ముఠా

ఇదిలా ఉంటే మంగళవారం నలుగురు ముఠా సభ్యులు నకిలీ బంగారాన్ని తీసుకుని ఖరీదైన కారులో వచ్చారు. అందులో ఇద్దరు గోరంట్లలోని ఓ బ్యాంకులో తాకట్టుపెట్టడానికి వెళ్లారు. మరో ఇద్దరు ఓడీసీలో ఓ బ్యాంకులో తాకట్టుపెట్టడానికి వెళ్లారు. అయితే గోరంట్లలో బ్యాంక్ అధికారులకు అనుమానం వచ్చి తాకట్టుపెట్టడానికి వచ్చిన వారిని బ్యాంక్‌లో పెట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెళ్లి ఆరాతీయగా అసలు విషయం వెలుగు చూసింది. 16తులాల బంగారం బ్యాంక్ సిబ్బందికి చూపించారు. అయితే అది నకిలీదని గుర్తించి బ్యాంక్ అధికారులు అప్రమత్తం అయ్యారు. గతంలోకూడా ఈ ముఠాసభ్యులు ఓడీసీలోని బ్యాంక్‌లో ఓ రైతు పేరుమీద వడ్డాణం కుదువ పెట్టారు. దీనిద్వారా రూ.30లక్షలు రుణం పొందారు. మంగళవారం కూడా ఇదేతరహాలో మరో 20తులాలు అక్కడికే తీసుకెళ్లారు. అయితే గోరంట్లలో సంఘటన జరిగిన వెంటనే ఓడీసీ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడ అప్రమత్తం కావడంతో వారిని కూడా ఓడీసీ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



కర్ణాటక ముఠా వినియోగించిన కారు



ఓడీసీ బ్యాంక్‌లో కుదువ పెట్టిన నకిలీ బంగారం

అంతర్గత శోధన

జిల్లాలో రెండు మండల కేంద్రాల్లో ఒకేరోజు రెండు ఘటనలు జరగడం అదికూడా ఒకే ముఠాకు చెందిన సభ్యులు కావడంతో గతంలో కూడా వీరు ఓడీసీలో రూ.30లక్షలు రుణం పొందడంపై బ్యాంక్ అధికారులు, గోల్డ్ ఫైనాన్స్‌లు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి. ఈ ముఠా సభ్యులు ఎక్కడెక్కడ నకిలీ బంగారం కుదువపెట్టారు? ఎవరిపేరుపై పెట్టారు? ఎంత మేర పెట్టారు? అన్న వివరాలను ఆరాతీసే పనిలో నిమగ్నమయ్యారు. అయితే బ్యాంక్ అధికారులకు ఈ ఘటనతో భయం చుట్టుకుంది. ఎక్కడెక్కడ నకిలీ బంగారం కుదువపెట్టారని బ్యాంక్ ఉన్నతాధికారులు కూడా ఆరాతీస్తున్నారు. గోరంట్ల, ఓడీసీ పోలీసుల అదుపులో నలుగురు ముఠా సభ్యులు ఉన్నారు. వీరిద్వారా మరింత సమాచారం రాబట్టేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఈ ముఠాకు లీడర్‌గా కర్ణాటకకు చెందిన వ్యక్తి ఉన్నాడని, ఆంధ్రతోపాటు కర్ణాటకలోని బ్యాంకుల్లో కూడా ఇదే తరహా మోసం చేసినట్లు సమాచారం.

తహసీల్దార్లు కావలెను..!

- ఎక్కడి సమస్యలు అక్కడే...
- జిల్లాలో ఐదు మండలాల్లో ఇన్‌చార్జ్‌ల పాలన
- అనంత తహసీల్దార్ దీర్ఘకాలిక సెలవు
- భూసమస్యలపై ప్రజలకు తిప్పలు
- పనుల కోసం పైసలు



విడపనకల్లు తహసీల్దార్ కార్యాలయం

అనంతపురం కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తహసీల్దార్ల పోస్టులకు డిమాండ్ ఏర్పడింది. ఏకంగా ఐదు మండలాలకు తహసీల్దార్లు లేరు. దాదాపు ఏడాదికి పైగా ఇదే పరిస్థితి. సంబంధిత మండలాల్లో ఇన్‌చార్జ్‌ల పాలన సాగుతోంది. ఆ మండలాల్లో రెవెన్యూ సమస్యలు పేరుకుపోయాయి. ఇన్‌చార్జ్‌లు చిన్న చిన్న సమస్యలు, ధ్రువీకరణ పత్రాలపై సంతకాలకే పరిమితమవుతున్నారనే విమర్శలు ఉన్నా యి. భూసమస్యలు పరిష్కారం కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే తరుణంలో దళారులు తహసీల్దార్ కార్యాలయంలో మీ పనులు చేయిస్తామంటూ పైసలు వసూలు చేస్తున్నారు.

ఇన్‌చార్జ్‌లే దిక్కు

జిల్లాలోని ఐదు మండలాల్లో తహసీల్దార్లు లేరు. దీంతో అక్కడ సమస్యలు పేరుకుపోయాయి. విడపనకల్లు తహసీల్దార్ లేకపోవడంతో ఇన్‌చార్జ్‌గా గుంతకల్లు తహసీల్దార్ రమాదేవికి అప్పగించారు. పుట్లూరు మండల ఇన్‌చార్జ్‌గా శింగనమల తహసీల్దార్ శేషారెడ్డికి, కూడేరు మండల ఇన్‌చార్జ్‌గా ఉరవకొండ తహసీల్దార్ మహబూబ్‌బాషాకు బాధ్యతలు అప్పగించారు. యల్లనూరు, వజ్రకరూరు మండలాల్లో స్థానికంగా పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దార్లకే ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇచ్చారు. కూడేరు మండలానికి ఇన్‌చార్జ్ తహసీల్దార్ వారంలో మూడు రోజులు వస్తుంటారు. ఉదయం లేదా సాయంత్రం సమయాల్లో వచ్చి వెళ్తుంటారని సమాచారం. కుల, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్లు, ఇతర చిన్న సమస్యలే పరిష్కారమవుతున్నాయని తెలుస్తోంది. విడపనకల్లు మండలానికి తహసీల్దార్ వారంలో ఒక్కరోజే వస్తారని, రెండు, మూడు గంటలే ఉంటున్నారని మండల ప్రజలు అంటున్నారు. పుట్లూ రు మండల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఇన్‌చార్జ్ తహసీల్దార్ అక్కడి కెళ్లడానికి 10 రోజులు పడుతోందని తెలుస్తోంది. యల్లనూరు, వజ్రకరూరు మండలాల్లో స్థానిక డిప్యూటీ తహసీల్దార్లే ఇన్‌చార్జ్‌లుగా ఉన్నప్పటికీ కీలక సమస్యలను పట్టించుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అనంతపురం అర్బన్ తహసీల్దార్‌గా ఉన్న హరికుమార్ నెలన్నర రోజులుగా సెలవులో ఉన్నారు. అధికారపార్టీ నేతల ఆశీర్వాదంతో ఆ సీటులోకి వచ్చిన ఆయన.. ఒత్తిళ్ల నేపథ్యంలోనే సెలవులో వెళ్లినట్లు సమాచారం. ఇక్కడా ఇన్‌చార్జ్‌గా రూరల్ తహసీల్దార్ మోహన్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగించారు. ఆయనేమో ఆ బాధ్యతలు తనకొద్దు బాబోయ్ అంటున్నారని సమాచారం. పలు సమస్యలు పేరుకుపోయాయి.

ప్రజలకు అవస్థలు

విడపనకల్లు మండలానికి చెందిన ఉమాదేవి అనే మహిళ ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం రెండునెలల క్రితం దరఖాస్తు చేసుకుంది. ఇది ఇవ్వాలల్సిన గడువు ముగిసినా ఇవ్వలేదు. మరోసారి దరఖాస్తు చేసుకున్నా అదే పరిస్థితి. అధికారులు పట్టించుకోకపోవడంతో చివరికి మూడో దరఖాస్తు చేసుకుంది. తహసీల్దార్ లేకపోవడంతో విడపనకల్లులో ఎలాంటి పరిస్థితి నెలకొందో ఈ ఉదాహరణ చెబుతుంది. మ్యుటేషన్, రీ సర్వే వంటి సమస్యల విషయంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పుట్లూరులో ఆన్‌లైన్ ఎక్కించుకునేందుకు ఇబ్బంది పడుతున్నారు. వజ్రకరూరులో పర్యటించిన కలెక్టర్ వీఆర్‌ఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చుక్కల భూములు, 22ఏ ఫైల్స్ విషయంలో పైకి పంపడంలో ఆయా మండలాల్లో నిర్లక్ష్యం కనిపిస్తోంది.

పైసలిస్తేనే పనులు..

రెగ్యులర్ తహసీల్దార్లు లేని ఆ కార్యాలయాల్లో పనులు కావాలంటే పైసలు కావాలంటున్నారు. సంబంధిత కార్యాలయాల్లో కింది స్థాయి నుంచి పై వరకు ఎవరి స్థాయిలో వారు ముడుపుల వ్యవహారం నడుపుతున్నారనే ఆరోపణలున్నాయి. వీఆర్‌ఓలు, సర్వేయర్లు, కొందరు రెవెన్యూ సిబ్బంది పనులు కావాలంటే ఆమ్యామ్యాలు పుచ్చుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసైన్డ్ భూములు, పేరు మార్పిడి, మ్యుటేషన్, వివాదం ఉన్న భూములలో సర్వే చేయడానికి డబ్బుల వ్యవహారం బాగానే నడుస్తున్నట్లు తెలుస్తోంది. కూడేరు మండలంలో ఓ వీఆర్వో పై అధికారులతో కలిసి పని త్వరగా చేయిస్తానంటూ ముడుపులు పుచ్చుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. డబ్బులు ఇవ్వందే విలేజ్ సర్వేయర్లు సర్వే చేయడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. కొందరు మధ్యవర్తులు దళారుల అవతారం ఎత్తి వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం.

భగీరథ ప్రయత్నం..!

సముద్ర మట్టానికి 2 వేల మీటర్ల ఎత్తు.. చిట్ట చివరన, కొండకోనల్లో ఉంది అమరాపురం. ఆ ఊరి చెరువుకు నీరు పారించడం, అది కూడా.. వందల కిలోమీటర్ల దూరం నుంచి కృష్ణాజలాలు తీసుకెళ్లడం సాధ్యమేనా? అసాధ్యమనే అనుకుంటారు. అలాంటి దానిని సుసాధ్యం చేస్తున్నారు. ఎట్టకేలకు అమరాపురం చెరువుకు త్వరలో కృష్ణాజలాలు చేరనున్నాయి. ఇందుకు సంబంధించి ట్రయల్ రన్ కూడా పూర్తయింది. అమరాపురం చెరువుకు కృష్ణా జలాలు తీసుకెళ్లడమంటే భగీరథ ప్రయత్నమేననడంలో అతిశయోక్తి లేదు.

అమరాపురం చెరువుకు త్వరలో నీరు

ట్రయల్ రన్ పూర్తి

నెరవేరనున్న రైతుల కల



అమరాపురం చెరువుకు నీరిచ్చేందుకు ట్రయల్ రన్

మడకశిర, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): కరువుతో తడారిపోయిన అమరాపురానికి కృష్ణాజలాలు రానున్నాయి. హంద్రీనీవా కాలువల ద్వారా నీటిని విడుదల చేయడానికి రెండ్రోజుల క్రితం ట్రయల్ రన్ నిర్వహించారు. కదిరేపల్లి వద్ద 17 పంపులను ఆన్ చేసి, నీటిని వదలడంతో అమరాపురం మండలంలోని ఆహ్లాదపల్లి వరకు కాలువ గుండా వెళ్లాయి. త్వరలోనే అమరాపురం ప్రాంతంలోని చెరువులకు నీటిని విడుదల చేయనున్నట్లు అధికారుల సమాచారం. మడకశిర చెరువుకు ప్రస్తుతం నీరు చేరుతోంది. గొల్లపల్లి రిజర్వాయర్‌లో 1.72 టీఎంసీల నీరు నిలువ ఉంది. సెప్టెంబరు 26 నుంచి ఇప్పటి వరకు గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నేరుగా మడకశిర ప్రాంతానికి కృష్ణానది జలాలు వస్తున్నాయి. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి అమరాపురం చెరువుకు 193 కిలోమీటర్ల దూరం ఉంది. అంత దూరం నీరు చేరనుంది. మడకశిర చెరువు అనంతరం హేల్కూరు చెరువుకు నీరు విడుదల చేయనున్నట్లు అధికారుల సమాచారం.

2.2 అడుగుల ఎత్తులో మడకశిర

కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన మడకశిర నియోజకవర్గం సముద్ర మట్టానికి 2.2 వేల అడుగుల ఎత్తులో ఉంది. దీంతో ఈ ప్రాంతంలో కురిసిన వర్షపు నీరంతా దిగువ ప్రాంతంలోని కర్ణాటక చెరువులకు చేరుతుంది. దీంతో ఈ ప్రాంతంలో తాగు, సాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చేది. సాగునీటి వనరులు కూడా లేవు. భూగర్భ జలాలు అడుగంటిపోయి తాగు, సాగునీటికి ఇబ్బందులు పడాల్సి వచ్చేది. కృష్ణా జలాలతో ఈ ప్రాంత చెరువులు నింపాలని నిర్ణయించారు. కూటమి అధికారంలోకి వచ్చాక పనులు వేగవంతం అయ్యాయి. కాలువలో బ్రిడ్జిలు నిర్మించాల్సి ఉంది. గత ప్రభుత్వంలో బ్రిడ్జిల నిర్మాణానికి అంచనాలు వేసి ప్రతిపాదనలు పంపినా.. నిధులు మంజూరు కాలేదు. కూటమి అధికారంలోకి రావడంతో మళ్లీ అంచనాలు వేసి, సంబంధిత శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. ఇప్పటి వరకు మడకశిర చెరువుకు కృష్ణాజలాలు చేరాయి. చిట్ట చివరన ఉన్న అమరాపురం వైపు నీరు చేరలేదు. త్వరలో కృష్ణాజలాలను అమరాపురం వైపు విడుదల చేయనున్నట్లు అధికారులు అంటున్నారు. బ్రిడ్జిల నిర్మాణం చేపడితే కృష్ణాజలాలు చేరుతాయని ఈ ప్రాంత ప్రజలు అంటున్నారు. ప్రస్తుతం తాత్కాలిక మర్మత్తులు చేసి నీటిని వదులుతున్నారు.

హామీ నెరవేర్చిన ముఖ్యమంత్రి

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మడకశిర ప్రాంతానికి వచ్చినపుడు ఈ ప్రాంతంలో నీటి సమస్య తీవ్రంగా ఉందని కృష్ణా జలాలతో చెరువులను నింపి సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి విన్నవించారు. ముఖ్యమంత్రి వెంటనే స్పందించి ఈ ప్రాంతంలోని చెరువులకు హంద్రీనీవా కాలువల ద్వారా కృష్ణాజలాలు నింపి తాగు, సాగునీటి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నేరుగా మడకశిర ప్రాంతంలోని చెరువులకు కృష్ణాజలాలు హంద్రీనీవా కాలువల ద్వారా చెరువులకు చేరుతున్నాయి. ఇప్పటికే మడకశిర మండలం మణూరు, హరేసముద్రం చెరువులు నిండాయి. హరేసముద్రం నుంచి మడకశిర వైపు నీటిని విడుదల చేశారు. అమరాపురం ప్రాంతంలోని చెరువులకు నీటిని విడుదల చేయడానికి ట్రయల్ రన్ నిర్వహించారు.

ఏళ్ల కల నెరవేరుతోంది



ఏళ్ల కల త్వరలో నెరవేరుతుండడంతో చాలా సంతోషంగా ఉంది. కృష్ణా జలాల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం. అమరాపురం మండలంలో 5వేల ఎకరాల్లో వక్కతోటలు సాగులో ఉన్నాయి. కృష్ణాజలాలతో చెరువులను నింపడానికి ట్రయల్ రన్ నిర్వహించడంతో అమరాపురం మండంలో కూడా హంద్రీనీవా కాలువల ద్వారా నీరు పారాయి. త్వరలో అమరాపురం చెరువుకు నీరు చేరుతుండడంతో సంతోషంగా ఉంది.

- రైతు శ్రీనివాస్, హోల్కూరు, అమరాపురం

ట్రయల్ రన్ నిర్వహించాం

అమరాపురం మండలంలోని చెరువులకు నీరివ్వడానికి కదిరేపల్లి వద్ద పంపులను ఆన్ చేసి, నీటిని విడుదల చేసి ట్రయల్ రన్ నిర్వహించాం. అమరాపురం మండంలోని ఆహ్లాదహళ్లి వరకు హంద్రీనీవా కాలువ ద్వారా నీరు పారాయి. ఇప్పటికే మడకశిర మండలంలోని మణూరు చెరువు నిండింది. త్వరలోనే అమరాపురం చెరువుకు నీరు విడుదల చేస్తాం.

- నాగార్జున, హెచ్ఎన్ఎస్ఎస్ ఏఈ

మాజీ సైనికులకు అండ

- పిల్లల విద్యకు ప్రత్యేక గ్రాంట్‌లు
- కుటుంబ సంక్షేమానికి పలు పథకాలు
- రాజ్యసైనిక్ బోర్డు ద్వారా చేయూత



జిల్లా సైనిక సంక్షేమశాఖ కార్యాలయం

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సైన్యంలో విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందిన మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యుల కోసం రాజ్యసైనిక్ బోర్డు పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది. మాజీ సైనికుల పిల్లల విద్యాభివృద్ధి, కుటుంబ సభ్యుల ఆర్థిక పరిపుష్టికి ప్రత్యేక గ్రాంట్‌లను తీసుకొచ్చింది. విద్యార్థులకు ఇంటర్ నుంచి ఉన్నత విద్య వరకూ స్కాలర్‌షిప్‌లు, కుమార్తెల వివాహాలకు గ్రాంట్‌లను అందిస్తోంది. వితంతు మాజీ సైనికుల పునర్వివాహం, అంగవైకల్యం, మాజీ సైనికుల దహన సంస్కారాల తదితర వాటి కోసం ఆర్థిక సాయాలను ఇస్తోంది. ఈ పథకాలను వినియోగించుకోవడంలో కొంత మంది ఇంకా వెనుకబడి ఉన్నారు. ఈ నేపథ్యంలో సైనిక సంక్షేమశాఖ పరిధిలో అమలవుతున్న పథకాలపై ప్రత్యేక కథనం.

మాజీ సైనికుల పిల్లలకు వర్తించే పథకాలు

ఇంటర్ చదివే విద్యార్థులకు ఎడ్యుకేషనల్ గ్రాంట్ కింద సంవత్సరానికి రూ. 8 వేలు ఇస్తారు. వృత్తిపరమైన కోర్సులు మినహా డిగ్రీ ఎడ్యుకేషనల్ గ్రాంట్ కింద సంవత్సర కాలానికి రూ. 8 వేలు, పీజీ కోర్సులు అభ్యసించే వారికి రూ. 8 వేలు, బీటెక్, ఎంబీబీఎస్, ఎంబీఏ తదితర కోర్సులు చదివే విద్యార్థులకు సంవత్సరానికి రూ. 10 వేలు చెల్లిస్తారు. ఉన్నత చదువుల నిమిత్తం హాస్టళ్లలో ఉన్న విద్యార్థులకు హాస్టల్ గ్రాంట్ కింద సంవత్సరానికి రూ. 10 వేలు, కుమార్తెల వివాహాలకు వివాహ గ్రాంట్ కింద ఒక్కో కుమార్తెకు రూ. 25 వేలు అందజేస్తారు. ఇద్దరు కుమార్తెలకు మాత్రమే ఈ గ్రాంట్ వర్తిస్తుంది. కులాంతర వివాహం చేసుకునే కుమార్తెలకు వివాహ గ్రాంట్ కింద రూ. 25 వేలు, మాజీ సైనికుడి వితంతువు పునర్వివాహం గ్రాంట్ కింద రూ. 25 వేలు, మాజీ సైనికుడు మరణిస్తే దహన సంస్కారాల ఖర్చులకు రూ. 10 వేలు, మాజీ సైనికుడి భార్య మరణిస్తే... దహన సంస్కారాలకు రూ.7వేలు, పిల్లలకు దహన సంస్కారాలకు రూ.5వేల చొప్పున గ్రాంట్ ఇస్తారు.

నూతన పథకాలు

మాజీ సైనికుల కుటుంబాల ఆర్థిక, సామాజిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కొన్ని నూతన పథకాలను ప్రవేశపెట్టారు. సైనిక్ స్కూల్‌లో ప్రవేశం పొందిన పిల్లలకు రూ. 15 వేలు, నేషనల్ డిఫెన్స్ అకాడమీలో ప్రవేశం పొందిన పిల్లలకు రూ. 30 వేలు, పీహెచ్‌డీ చేసిన వారికి రూ. 30 వేలు, సీఏ చేసిన వారికి రూ. 30 వేలు, విదేశాలలో ఉన్నత విద్యనభ్యసిస్తున్న వారికి రూ. 50 వేల చొప్పున ఏటా స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నారు. అనాథ పిల్లలకు ప్రత్యేక విద్యా గ్రాంట్ కింద రూ. 30 వేలు, సర్వీసులో మరణించిన సైనికుల కుటుంబాలకు ఆర్థికసాయం కింద రూ. లక్ష, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడలు, సంగీతం, నృత్యం తదితర వాటిలో నైపుణ్యం ప్రదర్శించిన మాజీ సైనికులు, వారి కుటుంబసభ్యులకు నగదు పురస్కారం కింద రూ. 10 వేలు చెల్లిస్తారు. ప్రమాదాలలో (అగ్ని, తుఫాన్) నష్టపోయిన మాజీ సైనికులకు ఆర్థికసాయం కింద రూ. 20 వేలు ఇస్తారు. వృత్తివిద్యా కోర్సులు చేస్తున్న మాజీ సైనికులకు, వితంతు మాజీ సైనికులకు రూ. 20 వేలు ఆర్థిక సాయం చేస్తారు.

అర్హతలు

గతంలో ప్రత్యేక నిధి నుంచి మంజూరు చేసే గ్రాంట్‌లు హవల్దార్ ర్యాంకు వరకూ పనిచేసిన మాజీ సైనికులకు మాత్రమే వర్తించేవి. ఆ నిబంధనను సడలిస్తూ అన్ని గ్రాంట్‌లు జూనియర్ కమిషన్ ర్యాంకు(జేసీఓ) వరకూ పనిచేసిన మాజీ సైనికులకు అమలు కానున్నాయి. ఈ పథకాలకు దరఖాస్తు చేసుకునే మాజీ సైనికుల పిల్లలు.. వారి తల్లిదండ్రుల ఐడీ కార్డు, డిశ్చార్జ్ బుక్, పెన్షన్ పేమెంట్ ఆర్డర్ కాపీ, విద్యార్థుల స్టడీ సర్టిఫికెట్, క్యాప్ సర్టిఫికెట్, తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాలతో దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. ఆ దరఖాస్తులను జిల్లా సైనిక సంక్షేమశాఖ కార్యాలయంలో అందజేయాలి. రాష్ట్ర అధికారుల ఆమోదంతో బ్యాంకు ఖాతాలకు గ్రాంట్ సొమ్ము జమ అవుతుంది.

ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలోని మాజీ సైనికులకు రాజ్య సైనిక్ బోర్డు కింద అమలయ్యే పథకాలను సద్వినియోగం చేసుకోవాలి. మాజీ సైనికుల పిల్లల విద్యకు సంబంధించిన పథకాలు అందుబాటులో ఉన్నాయి. స్కాలర్‌షిప్‌లతో పాటు కుమార్తెల వివాహం, దహన సంస్కారాలు, అంగవైకల్యం, వితంతు వివాహం, చిరు వ్యాపారాల కోసం అందించే ఆర్థిక సాయాలను స్కీమ్‌లో ఉన్నాయి. అర్హులైన ప్రతిఒక్కరూ ఈ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక ఇబ్బందుల నుంచి ఉపశమనం పొందవచ్చు.

- తిమ్మప్ప, జిల్లా సైనిక సంక్షేమశాఖ అధికారి

రైతులను మోసగించిన వ్యాపారి అరెస్టు


అరెస్టు చూపుతున్న ఎస్ఐ శివ

బెళుగుప్ప, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతుల నుంచి పప్పుశనగ, ధనియాల పంటలను కొనుగోలు చేసి డబ్బులివ్వకుండా మోసగించిన వ్యాపారి విక్రమ్‌ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బెళుగుప్పకు చెందిన వ్యాపారి విక్రమ్ రైతుల నుంచి రూ.2.65 కోట్లు విలువ జేసే ధాన్యాన్ని కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా మూడేళ్లుగా పరారీలో ఉన్నాడని తెలిపారు. మోసపోయిన బాధిత రైతులు ఈ యేడాది మార్చి 20న ఎస్పీకి ఫిర్యాదు చేశారని వివరించారు. మండలంలోని గుండ్లపల్లి వద్ద ఉన్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచామని పేర్కొన్నారు.

పోక్సో కేసు నమోదు

తాడిపత్రి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బాలిక గర్భం దాల్చడానికి కారకుడైన బాలుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ గౌస్‌బాషా బుధవారం తెలిపారు. తాడిపత్రి పట్టణంలోని బాలికకు మాయమాటలు చెప్పి బాలుడు మోసగించినట్లు వివరించారు. వారం రోజుల క్రితం బాలిక వారి బంధువుల ఊరిలో ప్రసవించింది. విషయం ఐసీడీఎస్ అధికారులకు తెలియడంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ గౌస్‌బాషా ఇద్దరిని విచారించారు. ఇద్దరూ మైనర్లు కావడంతో గర్భం దాల్చడానికి కారకుడైన బాలుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


నరసింహా రెడ్డి (ఫైల్)

తాడిమర్రి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పూల ఓబయ్యపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన నరసింహారెడ్డి(58) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆయనకు మూడున్నర ఎకరాల పొలం ఉంది. రూ. 10 లక్షలకు పైగా అప్పులు ఉన్నట్లు తెలిపారు. అప్పులిచ్చిన వారి నుంచి ఇటీవల వేధింపులు ఎక్కువయ్యాయని సన్నిహితుల వద్ద చెప్పుకునేవాడు. బుధవారం ఉదయం భార్య కాంతమ్మ వ్యవసాయ పనుల కోసం బయటకు వెళ్లింది. ఇంటిలో ఎవరూ లేని సమయంలో నరసింహారెడ్డి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువులు నరసింహారెడ్డి ఇంటికి వెళ్లి పరిశీలించగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ క్రిష్ణవేణి తెలిపారు. మృతుడికి భార్యతోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. వారికి వివాహాలు జరిగాయి.

క్యాన్సర్ బాధిత చిన్నారికి లోకేశ్ అండ

ఎమ్మెల్యే దగ్గుపాటి ఎల్‌ఓసీ ద్వారా రూ.12 లక్షల సాయం


ఎమ్మెల్యేకి వినతిపత్రం అందిస్తున్న తల్లిదండ్రులు (ఫైల్)

అనంతపురం క్రైం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారికి మంత్రి నారా లోకేశ్ అండగా నిలిచారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ చొరవ తీసుకుని బాలుడి సమస్యను లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే ఎల్‌ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) ద్వారా రూ.12 లక్షల సాయం అందించారు. నగరంలోని వేణుగోపాల్ నగర్‌కు చెందిన 12 ఏళ్ల బాలుడు క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. బెంగళూరులోని శంకర క్యాన్సర్ ఫౌండేషన్ ద్వారా బాలుడికి చికిత్స అందిస్తున్నారు. ఆర్థికంగా అంతంత మాత్రంగా నెట్టుకొస్తున్న తల్లిదండ్రులకు మరింత భారంగా మారింది. వారు స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటిని ఆశ్రయించారు. గత నెలలో జిల్లా పర్యటనకు వచ్చిన లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే బాలుడి వైద్య చికిత్సలకు సాయం అందించాలని కోరారు. స్పందించిన మంత్రి సీఎంఆర్ఎఫ్ పరిధిలో చికిత్సలకు ముందే ఎల్‌ఓసీ ద్వారా రూ.12 లక్షల సాయం అందించారు. దీంతో తల్లిదండ్రులు ఎమ్మెల్యేకి, మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యాశాఖలో ఇద్దరికి ఉద్యోగోన్నతి

అనంతపురం విద్య, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖలో ఇద్దరు రికార్డు అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతి కల్పించారు. షేక్షావలి, సత్యనారాయణకు జూనియర్ అసిసెంట్లుగా ప్రమోషన్ ఇస్తూ.. ఒకరికి బుక్కపట్నం డైట్, మరొకరిని తాడిపత్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు నియమించారు. ఈ మేరకు డీఈఓ ప్రసాద్‌బాబు బుధవారం ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో ఏడీలు మునీర్‌ఖాన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

తపాలా పథకాలను సద్వినియోగం చేసుకోండి

సూపరింటెండెంట్ అమర్‌నాథ్


అనంతపురం అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలు తపాల శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ సూపరింటెండెంట్ అమర్‌నాథ్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక తపాల ఎస్పీ కార్యాలయంలో పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన తన చాంబర్‌లో మీడియాతో మాట్లాడుతూ.... పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ పథకాలపై తపాల అధికారులు, సిబ్బంది ప్రజలకు మరింతగా అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రభుత్వం విధించిన లక్ష్యం మేరకు అధికారులు, సిబ్బంది పనిచేసేలా చొరవ చూపుతామన్నారు. కార్యక్రమంలో తపాల అసిస్టెంట్ సూపరింటెండెంట్లు ఉమామహేశ్వర్, కృష్ణచైతన్య పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.19వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో బుధవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.19వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8 వేలు, సరాసరి ధర రూ.13వేలు పలికాయన్నారు.

నేడే సీపీఐ వందేళ్ల వేడుకలు

ఉద్యమ కుటుంబాలకు సత్కారం
కేంద్ర, రాష్ట్ర నేతలు రాక
సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జగదీష్


మాట్లాడుతున్న జగదీష్

అనంతపురం విద్య, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)ఆవిర్భవించి వందేళ్లు కావడంతో గురువారం అనంతలో శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు జగదీష్ పేర్కొన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీపీఐది ఘన చరిత్ర అన్నారు. అలాంటి పార్టీ వందేళ్లు పూర్తి చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. శతాబ్ది వేడుకలను గురువారం అనంతపురంలోని లలితకళాపరిషత్‌లో నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలకోసం పోరాటాలు సాగిస్తూ అమరులైన కుటుంబాలకు ఆత్మీయ సత్కారం చేస్తామన్నారు. వేడుకలకు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజా, జాతీయ కార్యదర్శి రామక్రిష్ణ, రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య తదితరులు హాజరవుతున్నారన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, నేతలు మల్లికార్జున, లింగమయ్య, రాజేష్‌గౌడ్ పాల్గొన్నారు.

ఘరానా దొంగలు..!

తాళం వేసిన ఇళ్లే టార్గెట్... పగలు రెక్కీ.. రాత్రి చోరీలు
అంతర్రాష్ట్ర ముఠాను అరెస్టు చేసిన పురం పోలీసులు
రూ.40 లక్షల బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం
వివరాలు వెల్లడించిన ఎస్పీ సతీష్ కుమార్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్


స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి ఆభరణాలు

హిందూపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడే ఐదుగురు సభ్యుల అంతర్రాష్ట్ర ముఠాను హిందూపురం పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి సుమారు రూ.40 లక్షల విలువచేసే బంగారం, వెండి ఆభరణాలు, మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు వివరాలను హిందూపురం అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ సతీష్ కుమార్ బుధవారం వివరించారు. పట్టుబడినవారిలో గుంటూరు జిల్లా కేంద్రానికి చెందిన బండికాళ్ల రత్నరాజు అలియాస్ తేజ (ప్రస్తుతం పరిగి మండలం గొల్లపల్లిలో ఉంటున్నాడు), హిందూపురం మండలం హనుమేపల్లికి చెందిన బాబుప్రసాద్ (ప్రస్తుతం కర్ణాటకలోని విధురాశ్వత్థంలో ఉంటున్నాడు), హిందూపురం మండలం సంతేబిదునూరుకు చెందిన గంగరాజు, ఉప్పర సురేష్, గౌరీబిదునూరుకు చెందిన సిద్దిక్ సాబ్ ఉన్నారు. హిందూపురం సబ్ డివిజన్‌లో 2023 నుంచి ఇప్పటి వరకూ నమోదైన చోరీ కేసులను ఛేదించేందుకు పోలీసులు నిఘా వేశారు. ఈ క్రమంలో సంతేబిదునూరుకు చెందిన పాత దొంగల ముఠా వెంట కొత్త వ్యక్తి తిరుగుతున్నాడని హిందూపురం అప్‌గ్రేడ్ సీఐ ఆంజనేయులుకు సమాచారం వచ్చింది. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, వచ్చింది గుంటూరుకు చెందిన రత్నరాజు అని, చోరీల కోసం హిందూపురం ప్రాంతంలో రెక్కీ నిర్వహిస్తున్నారని తేలింది. దీంతో రత్నరాజును కూడా సీఐ అదుపులోకి తీసుకున్నారు. రత్నరాజు హిందూపురం పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లి, మేళాపురంలో మూడేళ్ల క్రితం చోరీకి పాల్పడ్డాడు. అప్పటి నుంచి తప్పించుకుని తిరుగుతున్నాడు. మిగిలిన ముఠా సభ్యులపై హిందూపురం వన్‌టౌన్ పరిధిలో రెండు, టూటౌన్ పరిధిలో మూడు, అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు, గోరంట్లలో రెండు, సోమందేపల్లి, లేపాక్షి, చిలమత్తూరు, కదిరి ఒక్కో చోరీ కేసు ఉన్నాయి. తమ విచారణలో నిందితులు నేరాలు ఒప్పుకున్నారని ఎస్పీ తెలిపారు. వారి నుంచి 310 గ్రాములు బంగారం ఆభరణాలు, 3 కిలోలకుపైగా వెండి ఆభరణాలు, మూడు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ ముఠా సభ్యులు కర్ణాటక, ఏపీలో తాళం వేసిన ఇళ్లను ముందుగా గుర్తిస్తారు. పగటిపూట రెక్కి నిర్వహించి, రాత్రిపూట ఇళ్లలో చొరబడి చోరీలు చేస్తుంటారు. దొంగల ముఠాను పట్టుకుని, కేసులను ఛేదించిన డీఎస్పీ మహేష్, సీఐలు ఆంజనేయులు, కరీం, రాజగోపాల్, జనార్దన్, ఎస్ఐ శ్రీధర్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. వారికి రివార్డులను అందజేశారు.

యువ ఖైదీలే పెట్టుబడి

రత్నరాజు జైలుకు వెళ్లిన ప్రతి సందర్భంలో జైలులో ఉన్న యువఖైదీలతో పరిచయం పెంచుకుంటాడు. ఎక్కడ చోరీ చేస్తే బాగుంటుందని ఆరా తీస్తాడు. ఆ ప్రాంత పోలీసుల పనితీరు గురించి కూడా తెలుసుకుంటాడు. ఏ స్టేషన్ పరిధిలో పోలీస్ అధికారి గట్టిగా ఉన్నాడు అనే కోణంలో కూడా ఆరాతీస్తాడు. అన్నీ తెలుసుకుని.. జైలు నుంచి బయటికి వచ్చాక అనువైన ప్రాంతాలలో తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసి లూటీ చేస్తాడు. చోరీ చేసిన సొమ్ములో కొంత మాత్రమే వెంట వచ్చిన తోడుదొంగలకు ఇస్తాడు. మిగిలిన సొమ్మంతా తానే తీసుకుంటాడు.

వీడు మామూలోడు కాదు..

గుంటూరుకు చెందిన బండికాళ్ల రత్నరాజు అలియాస్ తేజ వయసు 39 సంవత్సరాలు. ఇతను స్కెచ్ వేశాడంటే ఇంటి చుట్టూ పది మంది కాపలా ఉన్నా లూటీ కావాల్సిందే అని పోలీసులు అంటున్నారు. ఇంత ఆరితేరిన దొంగను ఇప్పటి వరకు తాము చూడలేదని విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు జిల్లాలో నమోదైన మొదటి కేసులో జైలుకు వెళ్లిన సమయంలో ఖైదీలతో పరిచయం పెంచుకున్నాడు. బయటకు వచ్చాక ఆ ఖైదీలు ఉంటున్న ప్రాంతాల్లో చోరీకి పాల్పడ్డాడు. మొదట తాళం వేసిన ఇళ్లను గుర్తించి, రెక్కీ నిర్వహిస్తాడు. ఒకటి రెండు రోజులు ఆ ఇళ్ల వద్ద పరిస్థితిని గమనిస్తాడు. ఇంటికిగాని, గేటుకుగాని తాళం వేసి ఉండి.. రెండు మూడు రోజులు పగలు, రాత్రి ఇంటి ముందు లైటు వెలుగుతూ ఉంటే.. ఆ ఇంట్లో ఎవరూ లేరని నిర్ధారించుకుంటాడు. చోరీకి అనువైనదని భావిస్తాడు. ఆ తరువాత కొంత మంది దొంగలతో కలిసి ఇంటివద్దకు వెళ్తాడు. కానీ దొంగతనం చేసేది మాత్రం రత్నరాజు ఒక్కడే. పది మంది వెంట వెళ్లినా.. ఇంట్లోకి చొరబడి సొమ్ము తీసుకొచ్చేది అతనొక్కడే. ఎందుకంటే తన వెంట వచ్చిన దొంగలనే నమ్మడు. రత్నరాజుపై ఇప్పటి వరకూ 55 చోరీ కేసులు నమోదయ్యాయి. పోలీసుల దృష్టికి రానివి ఇంకెన్ని ఉంటాయో తెలియదు.

చోరీ సొమ్ముతో గుంటూరులో ఇళ్ల నిర్మాణం

ఇళ్లలో చొరబడి చోరీ చేసిన సొమ్ముతో తన సొంతూరు గుంటూరులో రత్నరాజు రెండు ఇళ్లను నిర్మిస్తున్నాడు. వీటి నిర్మాణానికి ఇప్పటి వరకూ రూ.2 కోట్లు ఖర్చయి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఆ జిల్లా అధికారుల ద్వారా కోర్టు అనుమతితో ఇళ్లను అటాచ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నామని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు.

ఈఎస్ఐ ఆస్పత్రిలో ఇద్దరే..!

తాడిపత్రిలో అధ్వానం... వైద్యుడు, అటెండరే దిక్కు
మందులు కూడా లేని దుస్థితి
కార్మికులకు తప్పని తిప్పలు



ఈఎస్ఐ ఆసుపత్రి

తాడిపత్రి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నాపరాళ్లు, గ్రానైట్, సిమెంట్, ఐరన్ తదితర పరిశ్రమలు వందల సంఖ్యలో తాడిపత్రి ప్రాంతంలో ఉన్నాయి. వాటిలో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారు. అలాంటి కీలక ప్రాంతంలోని కార్మిక బీమా వైద్యశాలలో అన్నీ సమస్యలే. సిబ్బంది లేరు, సౌకర్యాలూ లేవు. వైద్యుడు, అటెండర్‌తోనే నెట్టుకొస్తున్నారు. ఫార్మాసిస్టు, నర్సు, క్లర్క్, స్వీపర్ తదితర పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక్కడ వేలాది కార్మిక కుటుంబాలు పరిశ్రమల్లో నివాసం ఉంటూ ఏ చిన్న ప్రమాదం జరిగినా ఈఎస్ఐ ఆస్పత్రికి వస్తున్నారు. ఇక్కడ సిబ్బంది, మందుల కొరతతో వైద్యం అందక అవస్థలు పడుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. వైద్యం అందదన్న ఉద్దేశంతో చాలామంది ఆస్పత్రికి రావడమే లేదు. ఒకవేళ వెళ్తే ఉన్న మందులు ఇచ్చి.. మిగిలినవన్నీ బయట తీసుకోవాలని రాసి పంపుతున్నానరు. ఆస్పత్రిలో కనీసం స్వీపర్ కూడా లేడంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

మందులు లేక బయటకు పంపించారు: వీరప్ప



బీపీ, మధుమేహంతో బాధపడుతున్నా. వాటితోపాటు జ్వరం రావడంతో ఆస్పత్రికి వస్తే మధుమేహానికి మందులు లేకపోవడంతో బయటకు రాసిచ్చారు. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది.

త్వరలోనే మందులు వస్తాయి: వెంకటేశ్వర్లు, వైద్యుడు



కొన్ని మందులు లేవనేది వాస్తవమే. ఇండెంట్ పెట్టాం. త్వరలోనే మందులు వస్తాయి. అన్ని మందులు ఆస్పత్రిలో ఇచ్చేలా చర్యలు చేపడతాం.

ఏళ్లుగా ఎదురుచూపు

వితంతువులకు అందని పింఛన్
కుటుంబ పోషణకు పలువురి ఇబ్బంది
సచివాలయాల చుట్టూ ప్రదక్షిణ



పింఛన్లు నమోదు చేసుకునే సచివాలయం

అమడగూరు, డిసెంబరు 10(ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వం అందించే పింఛన్ కోసం మండలంలోని పలువురు వితంతువులు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేయకపోవడంతో వారు ఆయా గ్రామాల అధికార పార్టీ నాయకులు, సచివాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. పింఛన్ పొందుతున్న వ్యక్తి మరణిస్తే మరుసటి నెల నుంచే అతడి భార్యకు ఆయన పింఛన్‌ను అందిస్తున్న ప్రభుత్వం తమ పట్ల శీతకన్ను వేయడం సరికాదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి తమకు పింఛన్ అందిస్తే తమ కుటుంబాల జరుగుబాటుకు ఆసరాగా ఉంటుందని వారు పేర్కొంటున్నారు.

రెండేళ్లు గడుస్తున్నా...: వెంకటమ్మ, ఎస్సీ కాలనీ



నా భర్త చనిపోయి రెండేళ్లకు పైబడింది. నాకు ఇద్దరు కుమారులు, కూలి పని చేస్తూ, పిల్లలను చదివించుకుంటున్నా. ఆస్తులు ఏ మాత్రం లేవు. ఉండటానికి ఇల్లు మాత్రమే ఉంది. వితంతు పింఛన్ అందిస్తే కొద్దిగా ఊరట కలుగుతుంది. అధికారులు స్పందించి పింఛన్ అందేలా చూడాలి.

సచివాలయంలో నమోదు చేయించా : మంజుల, మహమ్మదాబాద్



భర్తను కోల్పోయి మూడేళ్లు అయ్యింది. పింఛన్ కోసం సచివాలయంలో పలుమార్లు నమోదు చేయించా. అయినా పింఛన్ అందడం లేదు. ఆధార్, రేషన్‌కార్డు అన్ని ఇదే గ్రామంలో ఉన్నాయి. నాకు ఒక కుమారుడు, నామీదే ఆధారపడిన అవ్వ ఉన్నారు. నిత్యం కూలి పనికి పోతేనే ముద్ద నోట్లో దిగేది. పింఛన్ అందిస్తే కుటుంబ పోషణకు ఆసరాగా ఉంటుంది.

సైట్ ఓపెన్ కాగానే....: ముణెప్ప, ఎంపీడీవో

కొత్త పింఛన్‌లకు దరఖాస్తు చేసుకునేందుకు సైటు ప్రారంభించలేదు. సైటు ఓపెన్ కాగానే అర్హులైన వారి పేర్లు నమోదు చేసి, తప్పనిసరిగా పింఛన్‌లు అందిస్తాం. ఎవరైనా ఆధార్, రేషన్‌కార్డు పక్క మండలాలలో ఉంటే అలాంటి వారికి అందించేందుకు వీలు కాదు. అర్హులైన వారికి తప్పనిసరిగా అందిస్తాం.

రేపు షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపిక

బుక్కపట్నం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి షూటింగ్ బాల్ జట్లను శుక్రవారం ఎంపిక చేస్తామని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పూల ప్రసాద్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలో సీనియర్ మహిళలు, పురుషుల విభాగంలో ఎంపిక పోటీలను బుక్కపట్నంలోని శ్రీసత్యసాయి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఎంపికైన క్రీడాకారులు 19 నుంచి 21వ తేదీ వరకు కర్నూలు జిల్లాలో జరిగే 44వ సీనియర్ రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9573065966 నెంబరును సంప్రదించాలన్నారు.

నకిలీ సిమెంట్ బాగోతం బద్దలు

15 ఏళ్ల దందాలో రూ.కోట్ల ఆర్జన
విజిలెన్స్ దాడుల్లో గుట్టురట్టు

పెనుకొండ టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఒకటిన్నర దశాబ్ద కాలం నుంచి సాగుతున్న అక్రమ వ్యాపారం బాగోతం బట్టబయలైంది. విజయవాడకు చెందిన మహేష్ గోరంట్ల మండలం గుత్తివారిపల్లి సమీపంలో 15ఏళ్ల కిందట కస్తూరీ సిమెంటు ఫ్యాక్టరీ పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇక్కడి నుంచి లేపాక్షి సిమెంటు పేరుతో సిమెంటు తయారు చేయడానికి అనుమతి పొందాడు. అయితే అతడు నకిలీ సిమెంటు తయారు చేసి, ప్రముఖ కంపెనీల పేరుతో విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. విజిలెన్స్ తనిఖీలో ఈ విషయం ఇటీవల వెలుగు చూసింది. నకిలీ సిమెంట్ తరలించడానికి తొలుత వివిధ రకాల సిమెంటు కంపెనీల పేర్లున్న ఖాళీ సంచులను తమిళనాడు నుంచి తెస్తారు. బయట లారీల్లో వచ్చిన బూడిద(ఫ్లైయాష్), 20శాతం సిమెంటు కలిపి ఆ సంచుల్లో నింపుతారు. దాన్ని ప్రముఖ సిమెంటు కంపెనీల పేరుతో కర్ణాటకకు తరలించి విక్రయిస్తాడు. ఒక సిమెంటు బస్తా తయారీకి రూ.50 ఖర్చవుతుండగా లాభం రూ.300 వస్తోంది. రసీదులు కూడా నకిలీవి తయారు చేయించి, కర్నూలు నుంచి ఇన్వాయిస్ ఇస్తూ నకిలీ సిమెంటు బస్తాలు తరలిస్తున్నట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. దీంతో గోరంట్ల పోలీస్‌స్టేషన్‌లో విజయవాడకు చెందిన నిర్వాహకుడు మహేష్‌పై క్రిమినల్ కేసు నమోదుచేశారు. 15ఏళ్లలో నకిలీ సిమెంటు తయారు చేసి దాదాపు రూ.43కోట్లు దోపిడీ చేశారని విజిలెన్స్ అధికారుల దాడుల్లో తేలింది. స్థానికులకు అనుమానం రాకుండా ఉండేందుకు సిమెంటు కంపెనీలో పనిచేసేందుకు ఇతర ప్రాంతాల వారిని పెట్టుకుని వ్యవహారం కొనసాగించాడు. నకిలీ వ్యవహారం బయటపడటంతో సిమెంటు ఫ్యాక్టరీ నిర్వాహకుడు పరారీలో ఉన్నాడు. గోరంట్ల పోలీసులు అతడి కోసం గాలిస్తున్నారు.

నకిలీ సిమెంటు పరిశ్రమ


పోస్టాఫీసుల నిర్మాణాలు చేపట్టండి

● లోక్‌సభలో ఎంపీ అంబికా



అనంతపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కూడేరు, కంబదూరు, గుత్తి మండలాల్లో పోస్టాఫీసుల నిర్మాణాలు చేపట్టి ప్రజలకు సేవలందించాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కేంద్ర కమ్యూనికేషన్స్‌శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం పార్లమెంటు సమావేశాల్లో ఎంపీ మాట్లాడుతూ.. కూడేరు, కంబదూరు, గుత్తి మండలాల్లో పోస్టాఫీసుల పునరావృత మార్పుల వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆ మండలాల్లో శాశ్వత పోస్టాఫీస్ భవనాలు లేకపోవడంతో ప్రజలు అత్యవసర పోస్టల్ సేవల కోసం దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని అన్నారు. శాఖ ఇప్పటికే సొంత భూములు కలిగి ఉన్నప్పటికీ నిర్మాణ పనులు ప్రారంభంకాకపోవడంతో సేవలు అందుబాటులోకి వచ్చేందుకు ఆలస్యమవుతోందన్నారు. నిర్మాణాలు ఆలస్యం కావడంతో ఆ భూములు ఆక్రమణకు గురయ్యే ప్రమాదం ఉందని ఎంపీ కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు కేంద్ర మంత్రి పెమ్మసాని స్పందిస్తూ.. కూడేరు, కంబదూరు, గుత్తి మండలాల్లో పోస్టాఫీస్ శాశ్వత భవనాల నిర్మాణంపై సమీక్ష చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎంపీ తెలిపారు.

అనంతను అగ్రభాగాన నిలపాలి

ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ కేశవరెడ్డి పిలుపు


మాట్లాడుతున్న ముంటిమడుగు కేశవరెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అక్షర క్రమంలోనే కాదు.. పురోగతిలోనూ ఏడీసీసీ బ్యాంకును రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపాలని బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ సహకారభవన్‌లోని సమావేశ మందిరంలో ఏడీసీసీ బ్యాంకు మేనేజర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి బ్రాంచ్‌లు, వాటి పరిధిలోని సొసైటీల వారిగా పురోగతిని సమీక్షించారు. ప్రస్తుతం బ్యాంకు డిపాజిట్లు రూ.580 కోట్లు ఉందని, 2026 మార్చి నాటికి రూ.700 కోట్లకు సేకరించాలని మేనేజర్లను ఆదేశించారు. అదే విధంగా బ్యాంకు వ్యాపార టర్నోవర్ రూ.2080 కోట్ల నుంచి ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి రూ.2500 కోట్లకు పెంచాలని సూచించారు. త్వరలో బ్యాంకులో ఏకకాల రుణ పరిష్కార పథకం (ఓటీఎస్) అమలు చేసి, రైతులకు రుణవిముక్తి కల్పిస్తామని తెలిపారు. ఆప్కాబ్ డైరెక్టర్ సురేంద్ర రైతులకు అందించే పంట రుణాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో సీఈఓ సురేఖరాణి, డీజీఎంలు, సీనియర్ మేనేజర్లు, బ్రాంచ్ మేనేజర్లు పాల్గొన్నారు.

సుపరిపాలనపై ఢిల్లీలో శిక్షణ తరగతులు

అనంతపురం వైద్యం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజా శ్రేయస్సే ప్రథమ కర్తవ్యంగా సమాజానికి ప్రయోజనం చేకూర్చేలా సుపరిపాలన ఎలా అందించాలన్న అంశంపై జిల్లా అధికారులకు ఢిల్లీలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. జిల్లా నుంచి డీఆర్వో మలోల, ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి, బీసీ సంక్షేమ శాఖ అధికారి కుష్బు కొఠారి, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ అశోక్ శిక్షణ తరగతులకు వెళ్లారు. ప్రభుత్వ రంగ నిర్వహణలో అధికార దుర్వినియోగాన్ని రూపుమాపడం, నైతిక ప్రవర్తనను పెంపొందించడం, ప్రస్తుత అవసరాలను భవిష్యత్తు తరాలకు సమతుల్యం చేయడం తదితర అంశాలపై ఇతర రాష్ట్రాలకు చెందిన మాజీ ఐఏఎస్, ఐపీఎస్‌లు, ఇతర ప్రముఖులతో తరగతులు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పేదరికాన్ని తగ్గించి ఆర్థికాభివృద్ధి, సామాజిక ఐక్యత, స్థిరత్వంతో కూడిన సుపరిపాలన అందించి ప్రభుత్వాలపై ప్రజలకు నమ్మకం పెంచడమే శిక్షణ తరగతులు లక్ష్యం అన్నారు. సోమవారం నుంచి శుక్రవారం కొనసాగే తరగతుల్లో ఉపన్యాసాలు, పీపీటీ, వీడియోల ప్రదర్శనతోపాటు ఢిల్లీలోని పరిసర ప్రాంతాల స్థితిగతులపై సందర్శన ఉంటుందని తరగతులకు వెళ్లిన అధికారులు పేర్కొన్నారు.

హలో యువతా మేలుకో.. పోస్టర్ల విడుదల


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం విద్య, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): 'హలో యువత మేలుకో.. చెడు వ్యసనాల నుంచి నిన్ను నువ్వు కాపాడుకో' అంటూ యువతలో చైతన్యం తీసుకురావడానికి ఏఐవైఎఫ్ చేపడుతున్న ప్రచారయాత్ర అభినందనీయమని ఎస్పీ జగదీష్ కొనియాడారు. ఆ ప్రచార యాత్రకు సంబంధించిన పోస్టర్లను బుధవారం ఆయన స్థానిక తన కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. మంచి సమాజస్థాపన ఒక్కపోలీస్‌తో సాధ్యం కాదనీ, అన్నివర్గాల సంపూర్ణ మద్ధతు ఉన్నపుడే సాకారం అవుతుందని అన్నారు. అలాంటివాటికి ఏఐవైఎఫ్ యువత ముందుకు రావడం సంతోషకరమన్నారు. ఈప్రచార యాత్రకు పోలీస్‌శాఖ సంపూర్ణమద్దతు ఇస్తుందని హామీఇచ్చారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సంతోష్‌కుమార్, నాయకులు ఆనంద్, శ్రీనివాస్, సురేంద్ర, తేజ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ప్రొఫెసర్లకు ఉత్తమ పేపర్ అవార్డు


ప్రొఫెసర్లకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న వీసీ సుదర్శనరావు

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలోని మెకానికల్ విభాగం ప్రొఫెసర్లు కళ్యాణీరాధ, ఓం ప్రకాష్‌కు ఉత్తమ పేపర్ అవార్డు దక్కింది. దీంతో వీసీ ఆచార్య సుదర్శనరావు వారిద్దరిని బుధవారం తన చాంబర్‌లో అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ... ఈ ప్రొఫెసర్లు ఇద్దరూ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ అండ్ అప్లైడ్ ఫిజిక్స్ ఇంజనీరింగ్ ఇన్నొవేషన్ అండర్ సస్టైనబుల్ టెక్నాలజీస్ ఐసీఏఈఎస్-2025లో ఎఫెక్ట్ ఆఫ్ ఎగ్జాస్ట్ గ్యాస్ రీసర్క్యులేషన్ ఆన్ ది ఫర్‌పార్మెన్స్ అండ్ ఎమిషన్ క్యారెక్టరిస్టిక్స్ ఆఫ్ డీజల్‌ఇంజన్ ఫ్యూయల్డ్ విత్ మోరింగ్ ఆలిఫెర ఆయిల్ డీజల్ బ్లెండ్ అనే అంశంపై పరిశోధనలు చేసినందుకు ఉత్తమ పేపర్ అవార్డును అందుకున్నారన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణయ్య, వీసీ ఓఎస్డీ ఆచార్య దేవన్న, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య చెన్నారెడ్డి, కళాశాల అధ్యాపకులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణకు రాజీలేని పోరాటం



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐఎస్‌బీ నాయకులు, విద్యార్థులు

అనంతపురం విద్య, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): విద్యారంగ పరిరక్షణకు రాజీలేని పోరాటాలు చేస్తామని అఖిల భారత విద్యార్థిబ్లాక్ జాతీయ కన్వీనర్ బాలజయవర్దన్, పార్వర్డ్‌బ్లాక్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పీవీసుందరరామరాజు పేర్కొన్నారు. అఖిలభారతవిద్యార్థిబ్లాక్ 3వ రాష్ట్రమహాసభలు బుధవారం వారు నగరంలో నిర్వహించారు. తొలుత స్థానిక విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. అనంతరం లలితకళా పరిసత్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విద్యారంగ పరిరక్షణతో పాటు విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు విద్యార్థి సంఘాల పోరాటాలతోనే సాధ్యమవుతుందన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు విద్యారంగానికి పెద్దపీట వేస్తున్నాయని చెబుతున్నా.. అమలులో ఏమార్పు లేదన్నారు. వెంటనే విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే పెద్దఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బీ జిల్లా ప్రధానకార్యదర్శి పృధ్వీ, నాయకులు రాజేంద్రప్రసాద్, పోతులయ్య, చంద్రశేఖరరెడ్డి, రామచంద్ర వివిధ జిల్లాల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామీణ తపాలా ఉద్యోగులను

ఎనిమిదో వేతన కమిటీలోకి చేర్చండి

● కేంద్ర మంత్రికి సంఘం నాయకుల వినతి


అనంతపురం అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామీణ తపాలా ఉద్యోగులను ఎనిమిదో వేతన కమిటీ పరిధిలోకి చేర్చాలని కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాను గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం వారు ఢిల్లీలో ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామీణ తపాలా ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి శివగోపాల్ మిశ్రా, ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఏపీ సర్కిల్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్యయాదవ్ పాల్గొన్నారు.

వాజ్‌పేయి విగ్రహావిష్కరణకు తరలిరండి: బీజేపీ

శింగనమల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): భారతమాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతిని పురస్కరించుకుని అనంతపురం నగరంలోని గుత్తిరోడ్డులో ఆయన విగ్రహాన్ని ఈ నెల 12వ తేదీ శుక్రవారం ఆవిష్కరించనున్నారని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు బొమ్మన ఓబిరెడ్డి కోరారు. ఈ మేరకు మండలకేంద్రంలో బుధవారం పోస్టర్లు విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ విగ్రహావిష్కరణకు మండలంలోని కూటమి పార్టీల శ్రేణులు, ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో శింగనమల మార్కెట్ యార్డు డైరెక్టర్ మిట్టరాజు, నాయకులు మల్లెల శ్రీనివాసులు, అంజన్‌రెడ్డి, నరేంద్ర, మేఘనాథ్, తదితరులు పాల్గొన్నారు.

రామగిరి: ధర్మవరం పట్టణంలో భారత మాజీ ప్రధాని ఏబీ వాజ్‌పేయి కాంస్య విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించనున్నారని, కార్యక్రమాలకు కూటమి శ్రేణులు, ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం వారు మండలవ్యాప్తంగా పర్యటించి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చిత్రాశివయ్య, సీనియర్ నాయకులు గాజుల శ్రీనాథ్, కోడిరామ్మూర్తి తదితరులుపాల్గొన్నారు.

సహోద్యోగి కుటుంబానికి ఆర్థిక సాయం


చెక్కును అందజేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన ఎస్కేయూ ఉద్యోగి కుటుంబానికి సహచర ఉద్యోగులు ఆర్థిక సాయం అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. ఎస్కేయూలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కేశవకుమార్ ఇటీవల మృతి చెందారు. దీంతో ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు తోటి ఉద్యోగులు తమ వేతనాల నుంచి రూ. లక్ష పోగు చేసి అందుకు సంబంధించిన చెక్కును బుధవారం వీసీ ఆచార్య అనిత, రిజిస్ట్రార్ ఆచార్య రమేష్‌బాబు చేతుల మీదుగా బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వీసీ, రిజిస్ట్రార్ ఆ ఉద్యోగులను అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాన్‌టీచింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తిమ్మప్ప, వైస్ ప్రెసిడెంట్ నాగమునీంద్ర, ప్రధాన కార్యదర్శి మారుతి, సభ్యులు పాల్గొన్నారు.

సారొస్తారా..?

● నెలన్నరగా సెలవులో అర్బన్ తహసీల్దార్
● బుధవారం ముగిసిన వైనం
● పొడిగించుకునే ఆలోచనలో అధికారి
● సారు వస్తారో.. రారోనని కార్యాలయ వర్గాల చర్చ


అనంతపురం అర్బన్ తహసీల్దార్ కార్యాలయం

అనంతపురం రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అనంతపురం అర్బన్ తహసీల్దార్ హరికుమార్ సెలవులో వెళ్లి నెలన్నర గడుస్తోంది. గత అక్టోబరు 27 నుంచి నవంబరు 25వ తేదీ వరకు నెల రోజుల పాటు తొలుత సెలవు పెట్టారు. సెలవులు ముగియడంతో సార్ విధుల్లో చేరుతారని సంబంధిత వర్గాలు అనుకున్నారు. ఆయన మరో మారు పక్షం రోజులు సెలవును పొడిగించుకున్నారు. గత బుధవారంతో ఆయన సెలవు గడువు ముగిసింది. అయితే ఆయన విధుల్లో చేరికపై తహసీల్దార్ కార్యాలయ వర్గాల్లో తీవ్రస్థాయిలో చర్చసాగుతోంది. తిరిగి విధుల్లో చేరడానికి విముఖత వ్యక్తం అవుతున్నట్లు ఆ వర్గాల వారు అంటున్నారు. ఈ నేపథ్యంలో సారొస్తారా.. రారా.. అంటూ మాట్లాడు కోవడం జరుగుతోంది.

సెలవు పెట్టడానికి కారణాలెన్నో..!

తహసీల్దార్ సెలవులో వెళ్లి ఇప్పటికే నెలన్నర అవుతోంది. ఆయన దీర్ఘకాలికంగా సెలవులో వెళ్లడంపై చర్చకు తావిచ్చినట్లయింది. వాస్తవానికి సదరు అధికారి ఆరోగ్య పరమైన సమస్యతో సెలవు పెట్టినట్లు తెలుస్తోంది. ఆయన సెలవులో వెళ్లడం వెనుక రాజకీయ నాయకుల ప్రమేయం కూడా ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి. కొంతమంది నాయకులు చెప్పిన పనులకు ఆ అధికారి తల ఊపకపోడం వల్లనే సెలవులో వెళ్లడానికి కారణమన్న వాదనలు రెవెన్యూ వర్గాల నుంచి వ్యక్తం అవుతున్నాయి. సదరు అధికారి అడ్డదిడ్డమైన పనులు చేయరని, ఆయన స్థానంలో తమకు అనుకూలంగా వ్యవహరించే అధికారిని నియమించుకోవాలని రాజకీయ నాయకులు భావించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే సెలవు పెట్టించారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఓ అధికారిని నియమించాలని ప్రయత్నాలు జరిగినట్లు కూడా చర్చ నడుస్తోంది. ఇదిలా ఉండగా నిత్యం ఉండే ప్రొటోకాల్ విధులతో తహసీల్దార్‌తో పాటు కింది స్థాయి అధికారులు ఇబ్బందులు పడుతు న్నట్లు తెలుస్తోంది. ఇది కూడా సదరు అధికారి సెలవులో వెళ్లడా నికి కారణమన్న వాదనలు లేకపోలేదు. దీనికితోడు రెండు నెలల కిందట డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి లభిస్తుందని అనుకున్నారు. అది ఆయన ముందు అధికారితోనే ఆగిపోయింది. దీంతో సన్నిహితుల వద్ద నిరుత్సాహం చెందినట్లు సమాచారం. ఇది కూడా సదరు అధికారి సెలవులో వెళ్లడానికి మరో కారణంగా తెలుస్తోంది.

పొడిగించుకునే యోచనలో..

ఇదిలా ఉండగా తహసీల్దార్ మరో మారు తన సెలవును పొడిగించుకునే ధోరణిలోనే ఉన్నట్లు తెలుస్తోంది. ఆమేరకు ఉన్నతాధికారులను కూడా కలిసినట్లు సమాచారం. ఈ నెల ఆఖరి వరకు తన సెలవును పొడిగింపు చేసుకుంటున్నట్లు కార్యాలయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ సమయంలోపే మరో చోటుకు వెళ్లేందుకు ప్రయత్నాలు చేసుకుంటున్నారన్న వాదనలూ ఉన్నాయి. ఇదిలా ఉండగా విధుల్లో చేరికపై తహసీల్దార్‌ను వివరణ కోరగా.. ఆరోగ్య పరమైన సమస్యతోనే సెలవుపెట్టినట్లు చెప్పుకొచ్చారు. అంతేకాని మరొకటి లేదని పేర్కొన్నారు.

ఏడాదిన్నరలో ఎంతో అభివృద్ధి చేశాం: ఎమ్మెల్యే పరిటాల సునీత


నిర్మాణంలో ఉన్న రోడ్డును చూపుతున్న పరిటాల సునీత

కనగానపల్లి, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): ఏడాదిన్నర కాలంలోనే నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి చేశామని, రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మండలంలోని తూముచెర్లలో బుధవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే పేదలకు ఇంటిపట్టాల పంపిణీ, ఇళ్ల నిర్మాణాలపై అధికారులతో చర్చించారు. అదేవిధంగా గ్రామంలో 24గంటల విద్యుత్ 3ఫేస్ వ్యవస్థను ప్రారంభించారు. చెన్నమనాయని కోట నుంచి తూముచెర్ల మీదుగా తగరకుంట వరకూ జరుగుతున్న బీటీరోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామీణ రహదారులకు మోక్షం లభించిందన్నారు. ఏడాదిన్నరగా నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేశామన్నారు. రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు. గత వైసీపీ పాలనలో గుంతల రోడ్లకు కనీసం ప్యాచ్ వర్క్ కూడా చేయలేదని విమర్శించారు. ఓట్ల కోసం ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల వద్దకు వచ్చే నాయకులం తాము కాదని, నిరంతరం గ్రామాల్లో పర్యటిస్తూ అభివృద్ధి పనులు చేపట్టేవాళ్లమని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ అనిల్‌కుమార్, మార్కెట్‌యార్డ్ చైర్మన్ బోయపాటి సుధాకర్‌చౌదరి, టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, సర్పంచ్ మాధవరాజు, నాయకులు జయశంకర్ ఆదెప్ప, రామంజి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ


ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

అనంతపురం అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ డివిజన్ తనిఖీల్లో భాగంగా బుధవారం అనంతపురం నగరంలోని పలు ఎరువుల దుకాణాల్లో గుత్తి ఏడీఏ వెంకటరాముడు, అనంతపురం ఏఓ వెంకట్ కుమార్ తనిఖీలు చేశారు. భాస్కర్ అగ్రి సెల్యూషన్స్ దుకాణంలో నాగార్జున ఫర్టిలైజర్స్ కంపెనీకి చెందిన రూ.3.74 లక్షల విలువైన ఎరువులకు ఫారం-ఓ లైసెన్స్ లేనట్లు గుర్తించారు. దీంతో ఆయా ఎరువుల అమ్మకాన్ని నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

గ్రామీణాభివృద్ధిపై మాటామంతి

రామగిరి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిపై నిర్వహించిన మాటామంతి కార్యక్రమాన్ని మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల పరిషత్‌అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది వీడియోకాన్ఫరెన్స్ ద్వారా తిలకించారు. గ్రామాల అభివృద్ధికి ఏయే చర్యలు చేపట్టాలి, పంచాయతీరాజ్‌లోని ఏయే సమస్యలు పరిష్కరించాలి అనే అంశాలపై చర్చించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ వీసీలో డిప్యూటీ సీఎం సూచించిన సలహాలు, సూచనల మేరకు ముందుకు వెళ్లాలని సిబ్బందికి తెలిపారు.

నేటి నుంచి ఆరాధనోత్సవాలు

ఆత్మకూరు డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మదిగుబ్బ గ్రామంలో మూడు రోజుల పాటు జరిగే కాశిరెడ్డి నాయన ఆరాధనోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ ధర్మకర్త గొంచగారి జయరామిరెడ్డి బుధవారం ప్రకటనలో కోరారు. స్థానిక కాశినాయన ఆలయం వద్ద గురువారం నుంచి ఉత్సవాలు ప్రారంభమై శనివారం ముగుస్తాయన్నారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక అలంకరణలు, పూజలు జరుగుతాయన్నారు. అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

ప్రైవేటు విద్యాసంస్థల్లో రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలి


టీడీపీ ఎంపీ బీద మస్తాన్‌రావుకి వినతిపత్రం అందజేస్తున్న రవిశంకర్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు విద్యాసంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెట్టాలని ఆలిండియా ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ కోరారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలో పార్లమెంటరీ ఎస్సీఎస్టీ సంక్షేమ కమిటీ సభ్యుడు మల్లు రవి, ఎంపీలు బీద మస్తాన్‌రావు, వద్దిరాజు రవిచంద్ర, నాగరాజును ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల్లో ప్రైవేటు విద్యాసంస్థల్లో రిజర్వేషన్ కల్పించే బిల్లు ప్రవేశపెట్టాలని కోరారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తెలిపిన లెక్కల ప్రకారం ప్రైవేటు విద్యాసంస్థల్లో వి ద్యా, సామాజికంగా వెనుకబడిన ఎస్సీలు 0.89 శాతం, ఎస్టీలు 0.53శాతం, ఓబీసీ 11.16శాతం మాత్రమే ఉన్నట్లు వివరించారు. దేశంలో రోజు రోజుకీ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేటు విద్యాసంస్థల్లో ఎస్సీ ,ఎస్టీ ,బీసీలు లేకపోవడం దారుణమన్నారు ఈ విషయంలో పార్లమెంట్‌లో కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి బిల్లు ప్రవేశపెట్టాలని కోరారు. కార్యక్రమంలో సంఘానికి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు అవగాహన సదస్సు

రాప్తాడు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత సమాజంలో మహిళలపై జరుగుతున్న నేరాలపై మండలంలోని ప్రసన్నాయపల్లిలో పోలీసులు అవగాహన కల్పించారు. ఈ మేరకు బుధవారం గ్రామంలోని సవీర నర్సింగ్ కాలేజీలో మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో రాప్తాడు పోలీసులు, శక్తి టీం సభ్యులు మహిళలకు అవగాహన కల్పించారు. మహిళలపై జరుగుతున్న నేరాలు, ఫోక్సో కేసులపై మహిళలకు వివరించారు.

మహిళలు హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

● ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ సూచన


ప్రతిజ్ఞ చేస్తున్న ప్రిన్సిపాల్, మహిళా అధ్యాపకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహిళలు తమ హక్కులను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మశ్రీ సూచించారు. కళాశాలలో బుధవారం మహిళా సాధికారత విభాగ సమన్వయకర్త డాక్టర్ బృంద ఆధ్వర్యంలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా మహిళా అధ్యాపకులు హక్కుల వినియోగం పట్ల ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... ప్రతి మహిళ తమ హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని, వాటిని ఎలాంటి విభేదాలు లేకుండా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పలువురు మహిళా అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే అదే కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో జరిగిన మానవ హక్కుల దినోత్సవంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు నాగభూషణ, విష్ణుప్రియ మాట్లాడుతూ... ప్రాచీన కాలంలో నిరంకుశ పాలనలో హరించబడ్డ హక్కుల పోరాటాలతో సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మై భారత్ నోడల్ ఆఫీసర్ అచ్యుతనంద, అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

పంచాయతీల పాలనపై అవగాహన

అనంతపురంరూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ పాలన గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. నగరానికి చెందిన అఫ్లాటస్ గ్లోబల్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా బుధవారం మండలంలోని చిన్నంపల్లి గ్రామానికి వచ్చారు. ఈసందర్భంగా స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ శివశంకర్ గ్రామసభలు, పంచాయతీకి ఆదాయం, ఖర్చులు, ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పనులు కల్పన తదితర వాటి గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు సామాజిక అంశాల పట్లఅవగాహన కలిగిఉండాలని సూచించారు. ఉపాధ్యాయులు శ్వేత, అమృత, మురళి, లక్ష్మి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నక్ష రీసర్వేను పారదర్శకంగా చేపట్టాలి: ఏఎంసీ కమిషనర్


సమీక్షలో మాట్లాడుతున్న ఏఎంసీ కమిషనర్ బాలస్వామి

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సుమారు వంద ఏళ్ల తరువాత మున్సిపాలిటీల్లో స్థిరాస్థులపై నక్ష పేరుతో ప్రభుత్వం రేసర్వే చేస్తోందని, దీనిని పారదర్శకంగా చేపట్టాలని అనంత నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి ఆదేశించారు. స్థానిక అనంత నగరపాలక సంస్థ కార్యాలయ న్యూకౌన్సిల్ హాల్లో బుధవారం ఆయన నక్ష రీసర్వేపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఏ రాష్ట్రంలోనూ జరగని విధంగా ఏపీలో ప్రజల భూములు, ఆస్తులను గుర్తించి రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం నక్ష పేరుతో రీసర్వే చేపడుతోందని తెలిపారు. రెవెన్యూ, సర్వే భూ రికార్డుల శాఖ, మున్సిపల్ శాఖ సంయుక్తంగా డ్రోన్, కార్స్‌నెట్‌వర్క్, రోవర్ వంటి అధునాతన పరికరాలతో రీసర్వే చేస్తున్నారన్నారు. యాజమాని సమక్షంలో సర్వే చేసి కచ్చితమైన కొలతలు వేసి చూపించాలన్నారు. ఈ సర్వే నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా తప్పులు దొర్లితే వెంటనే సంబంధిత టెక్నికల్ సిబ్బంది ద్వారా నివృత్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం సీడీఎంఏ నుంచి వచ్చిన జీఐఎస్ నక్ష రీసర్వే ఇన్‌చార్జి ప్రవీణ్ కుమార్ నక్ష రీసర్వే ప్రాసెస్, అవకతవకలను సరిచేసే విధానం, నమోదుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ టౌన్ ప్లానింగ్ ఏసీపీ నీరజాక్షి, టీపీఎస్‌లు అంజలి, మంజుల, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది, వార్డు సచివాలయాల ప్లానింగ్ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

అలంకరాయనిపేటలో చురుగ్గా అభివృద్ధి పనులు


గ్రామంలో నిర్మాణం పూర్తయిన రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీఓ

శింగనమల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సొంత గ్రామమైన మండలంలోని అలంకాయనిపేటలో అభివృద్ధి పనులు శర వేగంగా సాగుతున్నాయి. ఆ గ్రామానికి మౌలిక వసతుల కోసం ఎమ్మెల్యేలు ఎంఎస్‌రాజు, బండారు శ్రావణిశ్రీ ప్రత్యేక చొరవతో మొదటి విడతగా రూ.59 లక్షల నిధులు మంజూరయ్యాయి. వాటితో ఇప్పటికే సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణం పూర్తవగా.. ఎంపీడీఓ భాస్కర్ బుధవారం పరిశీలించి మాట్లాడారు. ఇక్కడ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

టింబక్టు ఆధ్వర్యంలో స్ప్రింక్లర్ల పంపిణీ


రైతులకు స్ప్రింక్లర్లను పంపిణీ చేస్తున్న మేరీవటమట్టం

చెన్నేకొత్తపల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): టింబక్టు కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని చింతవనం కార్యాలయంలో బుధవారం రైతులకు సబ్సిడీపై స్ప్రింక్లర్ల పంపిణీ జరిగింది. ఇందులో మండలంలోని ముష్టికోవెల పంచాయతీలో మూడు గ్రామాలు, రామగిరికి సంబంధించి మొత్తం 46 మంది రైతులకు సంస్థ వ్యవస్థాపకులు మేరీ వటమట్టం స్ప్రింక్లర్లను పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొత్తం వ్యయం రూ.13లక్షలు కాగా ప్రభుత్వ సబ్సిడీ రూ.6.05లక్షలు, ప్రజల భాగస్వామ్యం రూ.2లక్షలు, మిగిలిన రూ.4.05లక్షలను సంస్థ భరించిందని తెలిపారు. సంస్థ ఈడీ సుకన్య, రాయలసీమ వాటర్ ప్రాజెక్టు మేనేజర్ పేరూరు శ్రీకాంత్, కో ఆర్డినేటర్ రవి, సేంద్రీయ వ్యవసాయ కో ఆర్డనేటర్ సన్నప్పయ్య, మేనేజర్ గొంది మహేశ్, అడ్మిన్ మేనేజర్ దుహిత, మిలిత మేనేజర్ జయశ్రీ, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ నాయకుల ఆందోళన

అనంతపురం విద్య, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని జిల్లా ఆస్పత్రి వద్ద బుధవారం ఏఐటీయూ నాయకులు అంబులెన్స్ డ్రైవర్లతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అంబులెన్స్ డ్రైవర్ల పేరుతో కొందరు గొడవలు, అల్లర్లు సృష్టిస్తున్నారని, ఇలా చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర అధ్యక్ష కార్యదర్శులు చిరంజీవి, కృష్ణుడు, పలువురు నాయకులు, అంబులెన్స్ డ్రైవర్లు పాల్గొన్నారు.

ఘనంగా కట్టమంచి రామలింగారెడ్డి జయంతి


రామలింగారెడ్డి, ఓబిరెడ్డి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కమలానగర్‌లో గల శ్రీసాయి డిగ్రీ కళాశాలలో బుధవారం తెలుగు వెలుగు సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో కట్టమంచి రామలింగారెడ్డి 145 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రధాన వక్త దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ.. రామలింగారెడ్డి రచించిన ముసలమ్మ మరణం ఆధునిక కావ్యంగా వాసికెక్కిందని కొనియాడారు. అలాగే ఇటీవల మృతిచెందిన ఎస్కేయూ విశ్రాంత ఉద్యోగి కె. ఓబిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించి తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన కృషిని గుర్తు చేశారు. తెలుగు వెలుగు వ్యవస్థాపకుడు టీవీ రెడ్డి, విశ్రాంత లేబర్ కమిషనర్ కృష్ణారెడ్డి, రచయిత షేక్ రియాజుద్దీన్, ఆశ్రయ అనాథ ఆశ్రమ నిర్వాహకుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ రామచంద్రపై సస్పెన్షన్ ఎత్తివేత

● ఓబుళాపురం జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా నియామకం

అనంతపురం విద్య, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం నియోజకవర్గం గుమ్మఘట్ట ఎంఈఓ-2 రామచంద్రపై సస్పెన్షన్ ఎత్తివేశారు. ఈయన శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం న్యామద్దల జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా ఉన్న సమయంలో నాడు, నేడు పనుల్లో అక్రమాలు జరిగాయని విచారణ కమిటీ నివేదిక ఇచ్చింది. దీంతో ఈఏడాది అక్టోబరు 28వ తేదీన ఆయన్ను సస్పెండ్ చేస్తూ ఆర్జేడీ శామ్యూల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు అప్పట్లో రామచంద్ర వ్యక్తిగత కక్షతోనే నాడు,నేడు పనుల బూచి చూపి తనపై చర్యలు తీసుకున్నారని ఆరోపించారు. తర్వాత నెలన్నరకు ఆయన సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ ఆర్జేడీ ఉత్తర్వులను జిల్లా విద్యాశాఖకు పంపినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు బుధవారం తెలిపారు. అయితే ఎంఈఓ బాధ్యతల నుంచి తప్పించి డీ. హీరేహాళ్ మండలం ఓబుళాపురం జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా నియమించినట్లు ఆర్జేడీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారని డీఈఓ మీడియాకు వెల్లడించారు.

న్యూస్ బాక్స్

టీడీపీలోకి స్వతంత్ర కౌన్సిలర్



గౌతమిని టీడీపీలోకి ఆహ్వానిస్తున్న అధ్యక్షుడు

కళ్యాణదుర్గం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ 15వ వార్డు స్వతంత్ర కౌన్సిలర్ గౌతమి టీడీపీలోకి చేరారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు స్వగృహంలో ఎమ్మెల్యే, జిల్లా టీడీపీ అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ ఆధ్వర్యంలో ఆమె టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ నాయకులకు అభివృద్ధి చేయడం చేతకాక, కులాలను అడ్డుపెట్టుకుని బెదిరింపులకు పాల్పడుతూ.. తమ ఉనికిని కాపాడుకుంటున్నారన్నారు. ప్రజలు ఇలాంటి నీచ సంస్కృతికి సహించరని, ఇప్పటికైనా వాటిని మానుకోవాలని హితవు పలికారు.

యువ రైతుకు సన్మానం



రైతు శంకర్‌నాయక్‌ను సన్మానిస్తున్న జితేంద్ర గౌడ్

గుంతకల్లు టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కనదొడ్డి తండ గ్రామానికి చెందిన మూడ్ శంకర్‌నాయక్ కంది, వేరుశనగ విత్తనాలు, నూతన వంగడాలపై రైతులకు అవగాహన కల్పించి.. అధిక దిగుబడి సాధించేలా కృషి చేశారు. ఆయన సేవలను గుర్తించి ఢిల్లీలోని భారతదేశ నూతన విత్తన వంగడాల అభివృద్ధి పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో క్రిషి జగ్రాన్ ఆర్గనైజేషన్ వారు ఇక్రిశాట్ అవార్డును ఇటీవల అందజేశారు. శంకర్‌నాయక్‌ను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ స్థానిక తన క్యాంపు కార్యాలయంలో బుధవారం శంకర్ నాయక్‌ను సన్మానించారు.

ఇన్‌ఫ్లో 1,950 క్యూసెక్కులు

బెళుగుప్ప, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 1,950, ఔట్‌ఫ్లో 1,950 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు బుధవారం తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.708 టీఎంసీల నీరు ఉందని, ఇక్కడి నుంచి ఫేజ్-2కు 1,783 క్యూసెక్కులు నీరు వెళ్తోందని తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పామిడి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎంపీఆర్ డ్యాం నుంచి పెన్నానదికి త్వరలోనే నీటిని విడుదల చేస్తున్నట్లు తహసీల్దార్ షర్మిల, హెచ్ఎల్‌సీ ఏఈ కిషోర్ బుధవారం పేర్కొన్నారు. దీంతో మండలంలోని పెన్నానది పరివాహక ప్రాంతాల్లోని కోనేపల్లి, అప్పాజీపేట, కండ్లపల్లి, వంకరాజుకాలువ, పామిడి ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పెన్నానదికి రోజుకు 500 క్యూసెక్కుల పైగానే నీటిని విడుదల చేస్తామన్నారు.

నేడు గంగమ్మ ఆలయ వార్షికోత్సవం

యల్లనూరు, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీకాలనీలో గంగమ్మ ఆలయ ఏడో వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయాన్నే అమ్మవారికి ప్రత్యేక పూజలు, చల్లముద్ద కార్యక్రమం నిర్వహిస్తామని, వృషభరాజ పోటీలు, చెక్కభజన కార్యక్రమం, రాత్రికి గంగమ్మ కథ ఉంటుందని తెలిపారు.

రెండు గేట్ల ద్వారా నీటి విడుదల

కూడేరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్ డ్యాంలోని రెండు ప్రధాన గేట్ల నుంచి 460 క్యూసెక్కుల నీటిని మిడ్ పెన్నార్ డ్యాంకు విడుదల చేస్తున్నట్లు అధికారులు బుధవారం తెలిపారు. ప్రస్తుతం డ్యాంలో 435.450 మీటర్ల వద్ద నీటి మట్టం ఉండగా, 5.180 టిఎంసీల నీరు ఉందని తెలిపారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పీఏబీఆర్ డ్యాంలోకి ఇన్‌ఫ్లో పూర్తిగా తగ్గిపోయిందన్నారు.

కుక్కల పట్టివేత

గుంతకల్లు టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆచారమ్మ కొట్టాల ఏరియాలో బుధవారం సేహ్నా ఏజెన్సీ ఆధ్వర్యంలో కుక్కలు పట్టివేతను ప్రారంభించారు. అన్ని వార్డులలో కుక్కలు పట్టివేస్తామని కమిషనర్ నయీమ్ అహ్మద్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ భవాని, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మి పాల్గొన్నారు.

రేపు హుండీ ఆదాయం లెక్కింపు

గుంతకల్లు టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుగ్గసంగాలలోని శ్రీ బుగ్గసంగమేశ్వర ఆలయంలో శుక్రవారం హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ కృష్ణయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు, భక్తులు, గ్రామ పెద్దలు, దేవదాయ శాఖ ఆధ్వర్యంలో హుండీలను లెక్కిస్తామన్నారు.

ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

శెట్టూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్లచేడు, బుడ్డయ్యదొడ్డి, గంటయ్యదొడ్డి, కాడప్పగారి తోట గ్రామాలను పెరుగుపాలెం పంచాయతీ నుంచి విభజించి.. త్వరలో చేరి గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలనిగ్రామస్థులు కోరుతున్నారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీవో జీలాని బాషాకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వానికి ప్రతిపాదన పంపుతామని ఎంపీడీవో తెలిపారు.

ఘనంగా బసిరెడ్డి ఆరాధనోత్సవం

యల్లనూరు, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): దంతలపల్లిలో అవధూత బసిరెడ్డి 95వ ఆరాధనోత్సవాన్ని సర్పంచు శివనాగిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ అధ్యాత్మికవేత్త తులసిరెడ్డి, రాచకొండ జానకిరామశర్మ ఇందులో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

నిర్మాణాలను త్వరగా పూర్తి చేయండి

● అధికారులకు కలెక్టర్ ఆనంద్ ఆదేశం ● విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాల పరిశీలన

వజ్రకరూరు (ఉరవకొండ), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని రాగుల పాడు, కొనకొండ్ల గ్రామాల్లోని విలేజ్ హెల్త్ క్లినిక్‌ల భవన నిర్మాణాలను 20 రోజుల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆనంద్ అధికారలకు ఆదేశించారు. బుధవారం వాటిని పరిశీలించిన ఆయన మా ట్లాడారు. ఈ భవనాల నిర్మాణానికి నిధులు ఉన్నా యని, పేమెంట్‌లకు ఎలాంటి ఇబ్బందులు లేవని అన్నా రు. అనంతరం ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. స్థానిక 1వ వార్డులో తాగునీటి సమ స్య తీర్చాలని, విద్యుత్ స్తంభాలు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కలెక్టర్‌ను కోరారు. భూవివాదం సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వీఆర్వోపైన కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట గుంతకల్లు ఆర్డీవో శ్రీనివాస్, డీఎల్‌డీవో విజయలక్ష్మి, తహసీల్దారు నరేష్, ఎంపీడీవో శివాజీ రెడ్డి, ఏఈ మణిభూషణ్, ఈవోఆర్డీ దామోదర్‌రెడ్డి ఉన్నారు.

● నెట్టికంటి సేవలో..

గుంతకల్లుటౌన్: కలెక్టర్ ఆనంద్ కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయ స్వామిని బుధవారం దర్శించుకున్నారు. ఆలయ ఈఓ మేడేపల్లి విజయరాజు, వేదపండితులు, అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. కలెక్టర్‌కు స్వామి వారి తీర్థప్రసాదాలు, ఆంజనేయ స్వామి చిత్రపటం అందజేసి ఆశీర్వాదం చేశారు. అనంతరం ఆలయ అభివృద్ధి పనులను కలెక్టర్ పరిశీలించారు. మురుగు కాలువల నిర్మాణానికి నిధులు కేటాయిస్తా మన్నారు. మాస్టర్‌ప్లాన్‌పై ఆలయ అధికారులు, రెవెన్యూ అధికారులు, గ్రామస్థులతో చర్చించారు. ఆయన వెంట ఆలయ అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ రమాదేవి, రూరల్ ఎస్ఐ రాఘవేంద్రప్ప, ఏఎస్ఐ వెంకట రమణ, ఆలయ అధికారులు ఉన్నారు.



కొనకొండ్లలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

● సమస్యలపై వినతులు

గుంతకల్లులోని సరోజినినాయుడు మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో కలెక్టర్‌ను పలువురు కలిసి సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాల తరగతి గదులు శిథిలావస్థకు చేరుకున్నా యని, వర్షం వస్తే తరగతి గదులు కారుతు న్నాయని, ఈ కళాశాలను వృథాగా ఉన్న రైల్వే తెలుగు మీడియం పాఠశాలలోకి మార్చాలని టీడీపీ ఇన్చార్జి గుమ్మనూరు నారాయణస్వామి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఎఫ్‌సీఐ గోదాములో సమస్యలు పరిష్కరించాలని బీజేపీ నాయకురాలు విజయలక్ష్మి వినతిపత్రం అందజేశారు. బళ్లారి గేట్ సమీపంలో ప్రభుత్వ స్థలంలో కబ్జాకు గురికాకుండా జీఎస్టీ, సబ్ రిజిస్టర్ కార్యాలయాలను ఎమ్మెల్యే, ఎంపీ నిధులతో నిర్మించాలని సీపీఐ నాయకులు గోవిందు, వీరభద్రస్వామి, మహేష్, గోపినాథ్, ఎస్ఎండీ గౌస్ వినతి పత్రం అందజేశారు.

విగ్రహావిష్కరణకు తరలిరండి

రాయదుర్గం రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): భారతరత్న, మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి శతజయంతి సందర్భంగా శుక్రవారం అనంత పురంలో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నారని, ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

క్రికెట్ కిట్ల అందజేత

బొమ్మనహాళ్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దేహాళ్ హైస్కూల్లో ఈనెల 5న నిర్వహించిన మెగా పీటీఎం కార్య క్రమంలోవిప్ కాలవ శ్రీనివాసులు పాల్గొన్నారు. విద్యార్థుల అభ్యర్థ న మేరకు క్రికెట్ కిట్లు అందజే స్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ మేరకు బుధవారం కాలవ శ్రీనివాసులు కుమార్తె కాలవ గౌతమి రూ.32 వేల విలువ చేసే క్రికెట్ కిట్లను ఆ పాఠశాల ఉపాధ్యాయులకు అందించారు.



కిట్లు అందిస్తున్న గౌతమి

విగ్రహ ఏర్పాటు సమస్య మళ్లీ మొదటికి..



అభ్యంతరం వ్యక్తం చేస్తున్న బలిజ సంఘం నాయకులు

యాడికి, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): యాడికిలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. యాడికిలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని స్థానిక అంబేద్కర్ కాలనీవాసులు ఆరునెలలుగా రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు ఇస్తున్నారు. దీంతో ఈ నెల 8న యాడికిలోని బస్టాండ్ వద్ద కమలపాడు ఆటో స్టాండ్ సమీపంలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు రెవెన్యూ అధికారులు స్థలం చూపించారు. విగ్రహ ఏర్పాటుకు అంబేద్కర్ కాలనీవాసులు పిల్లర్ నిర్మాణానికి గుంత తవ్వారు. దీనిపై అభ్యంతరాలు రావడంతో... స్థానిక శ్రీ కృష్ణదేవరాయల విగ్రహం పక్కనే అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవాలని అధికారులు సూచించారు. దీంతో బుధవారం శ్రీకృష్ణదేవరాయల విగ్రహం పక్కనే అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు మళ్లీ గుంత తవ్వారు. శ్రీకృష్ణదేవరాయ విగ్రహానికి నాలుగు అడుగుల దూరం ఉండేలా అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసుకోవాలని బలిజసంఘం నాయకులు అభ్యంతరం లేవనెత్తారు. దీంతో ఆ నాయకులకు కొంత వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు సమస్య మళ్లీ రెవెన్యూ అధికారుల వద్దకు చేరింది.

రేపు వైద్య శిబిరం

విడపనకల్లు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ చౌడేశ్వరి దేవి దేవాలయ ప్రాంగణంలో శుక్రవారం వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు విడపనకల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుడు మస్రద్ జాహ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో కార్డియాలజి, గైనకాలజీ, పీడియాట్రిక్స్, యూరాలజీ, ఈఎన్‌టీ, డెంటల్, కంటి పరీక్షలు, జనరల్ మెడిషన్, స్త్రీల సమస్యలపై నిపుణులైన వైద్యులతో వైద్య సేవలు అందిస్తామన్నారు. జీఆర్‌బీఎస్ బీపీ, ఈసీజీ, 2డీ ఏకో పరీక్షలు నిర్వహి స్తామన్నారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టెట్ నుంచి మినహాయించాలి



రాయదుర్గం : డీటీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రాయదుర్గం రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సర్వీసుల్లో ఉండే సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటరామిరెడ్డి, జిల్లా కార్యదర్శులు హనుమంతరెడ్డి, రవికుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం ఎమ్మార్సీ భవనం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. గంటపాటు నిరసన వ్యక్తం చేశారు. డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్‌రాయ్‌కు వినత పత్రం అందజేశారు. అదే విధంగా పదో తరగతి విద్యార్థులకు వందరోజుల ప్రణాళికలో పండుగలు, సెలవు దినాలకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల నాయకులు రామాంజినేయులు, మంచు నాగరాజు, మురళి, సుబ్రహ్మణ్యం, నాగేంద్ర పాల్గొన్నారు.

● ఉరవకొండ : తహసీల్దారు కార్యాలయం వద్ద యూటీఎఫ్ జిల్లా సహాయ అధ్యక్షుడు రామప్పచౌదరి ఆధ్వర్యంలో నాయకులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సర్వీస్‌లోని ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. అనంతరం ఈడీటీ వరప్రసాద్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు శేఖర్, ఉమాపతి, లక్ష్మీనారాయణ, రఘు, బండయ్య, నాగరాజు, శ్రీనివాస్ గుప్తా, శ్రీరాములు పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్‌కు భూమిపూజ



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

తాడిపత్రి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కాంప్లెక్స్ సమీపంలో రూ.80 లక్షలతో కాంప్లెక్స్ నిర్మాణానికి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి భూమిపూజ బుధవారం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ నిర్మాణం పూర్తయితే.. పట్టణ అభివృద్ధితో పాటు మున్సిపల్ ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శివరామ కృష్ణ, నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, నరేంద్రనాయుడు, చింబిలి ప్రసాద్‌నాయుడు, హరినాథ్‌రెడ్డి, తిరుపాల్‌రెడ్డి, విజయ్‌కుమార్, మల్లికార్జున, షెక్షావలి, అరుణ, రేష్మాపర్వీన్, రంగనాథరెడ్డి అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఖర్చు ఆదా

బొమ్మనహాళ్, డిసెంబరు, 10(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి ఆధారిత వ్యవసాయ సాగుతో ఖర్చులు గణనీయంగా తగ్గడంతోపాటు ఆరోగ్యవంతమైన పంటలు పొందవచ్చని రాష్ట్ర సీటీఐఓ శాస్త్రవేత్త లక్ష్మినాయక్, సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్లు నవీన్‌కుమార్, నరేంద్ర పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గోవిందవాడ, తారకాపురం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగుచేసిన మిరప పంటలను వారు పరిశీలిం చారు. వారి వెంట ఎన్ఎఫ్ఎ ఖ్యాతి, వంశీ, పున్నంచందు, వన్నూరు, అర్బైఎస్ఎస్ దినేష్ ఉన్నారు.

ఎంఈఓ రామచంద్రపై సస్పెన్షన్ ఎత్తివేత

అనంతపురం విద్య, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం నియోజకవర్గం గుమ్మఘట్ట ఎంఈఓ-2 రామచంద్రపై సస్పెన్షన్ ఎత్తివేశారు. ఈయన శ్రీ సత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం న్యామద్దల జడ్పీ హైస్కూల్ హెచ్ఎంగా ఉన్న సమయంలో నాడు-నేడు పనుల్లో అక్రమాలు జరిగాయని విచారణ కమిటీ నివేదిక ఇచ్చింది. దీంతో ఈ ఏడాది అక్టోబరు 28న ఆయనను సస్పెండ్ చేస్తూ ఆర్జేడీ శామ్యూల్ ఉత్తర్వులు జారీ చేశారు. వ్యక్తిగత కక్షతోనే నాడు-నేడు పనుల్లో బూచి చూపి తనపై చర్యలు తీసుకున్నారని నాడు రామచంద్ర ఆరోపించారు. తర్వాత నెలన్నరకు ఆయన సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ ఆర్జేడీ ఉత్తర్వులను జిల్లా విద్యాశాఖకు పంపినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు బుధవారం తెలిపారు. రామచంద్రను ఎంఈఓ బాధ్యతల నుంచి తప్పించి డీ. హీరేహాళ్ మండలం ఓబుళాపురం జడ్పీ హైస్కూల్ హెచ్ఎంగా నియమించినట్లు ఆర్జేడీ ఉత్తర్వులు జారీ చేశారని డీఈఓ తెలిపారు.

భయం.. భయంగా బడి

పెచ్చులూడుతున్న కొత్త కడమలకుంట పాఠశాల భవనం

వజ్రకరూరు (ఉరవకొండ), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం కొత్త కడమలకుంటలో పాఠశాలలో 1వ నుంచి 5వ తరగతి వరకూ 25 మంది విద్యార్థులున్నారు. ఆ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో పెచ్చులూడి పడుతున్నాయి. ఇనుపకడ్డీలు కనిపిస్తున్నాయి. ఇటీవల పెచ్చులూడి ఉపాధ్యాయుడిపై మీద పడ్డాయి. దీంతో విద్యార్థులకు వరండాలో తరగతులను నిర్వహిస్తున్నారు. ఆ వరండా పరిస్థితీ అంతంతే. వర్షాల కాలం వస్తే పరిస్థితి మరీ దారుణం. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది కోరుతున్నారు. దీనిపై ఎంఈవో ఎర్రిస్వామిని వివరణ కోరగా మరమ్మతులకు సంబంధించి ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపామని, నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామని తెలిపారు.



పెచ్చులూడిన భవనం

క్రైం న్యూస్..

చికిత్స పొందుతూ మహిళ మృతి

బొమ్మనహాళ్, డిసెంబరు, 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురువళ్లి గ్రామానికి చెందిన గురుస్వామి భార్య జయలక్ష్మి (23) బళ్లారి విమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం మరణించింది. వీరికి మూడు నెలల క్రితమే వివాహమైంది. గతనెల 17న ఇంట్లో ఎవరూలేని సమయంలో ఆమె పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను బళ్లారి విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్ఐ నబీరసూల్ తెలిపారు. కడుపునొప్పి తాళలేకే జయలక్ష్మి ఆత్మహత్య చేసుకున్నట్లు జయలక్ష్మి తల్లి సరోజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి..

యాడికి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నలక్షుంపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు (56) బుధవారం మరణించాడు. ఈయన మంగళవారం రాయలచెరువులో ద్విచక్రవాహనంలో వస్తుండగా ఎదురుగా వేగంగా వచ్చిన మరో బైక్ ఢీకొంది. గాయపడిన శ్రీనివాసులును అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు. శ్రీనివాసులుకు భార్య రామాంజినమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

కొండపాడు గ్రామ వాసి..

పెద్దవడుగూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరేపల్లి గ్రామ సమీపంలో మూడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో కొండపాడు గ్రామ వాసి కుళ్లాయిస్వామి (33) తీవ్రంగా గాయపడ్డ విషయం విదితమే. బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మరణించాడు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

చీనీచెట్ల నరికివేత

పుట్లూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంటలో రైతు గండికోట గోపాల్‌కు చెందిన ఐదు చీనీచెట్లను నరికివేసినట్లు పోలీసులు తెలిపారు. గోపాల్ బంధువు నాగమణి పాతకక్షల నేపథ్యంలో తోటలోకి ప్రవేశించి కొడవలితో నరికివేస్తుండగా గమనించిన గోపాల్ అడ్డుకున్నట్లు తెలిపారు. చెట్లతోపాటు తోటకు ఉన్న జాలరిని పీకేసిందన్నారు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఫిర్యాదు మేరకు ఆమెపై కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

ఘర్షణలో నలుగురికి గాయాలు

పుట్లూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరేపల్లి గ్రామంలో వ్యవసాయ బోరు విషయంలో జరిగిన ఘర్షణలో ఒక వర్గానికి చెందిన నలుగురు గాయపడ్డారు. బంధువులైన కల్యాణి, పెద్ద వెంకటేష్ బోరు మరమ్మతులకు నోచుకుంది. ఈ విషయంలో మాటామాటా పెరిగి ఇరు వర్గాల వారు గొడవపడ్డారు. దీంతో ఒక వర్గానికి చెందిన కల్యాణి, వెంకటరమణ, నరేష్, రమణమ్మ గాయపడ్డారు. రెండు ద్విచక్రవాహనాలను, తోటలోని డ్రిప్ వైర్లను ధ్వంసం చేశారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు నమోదుచేస్తామన్నారు.

జూదరుల అరెస్టు

బ్రహ్మసముద్రం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పులకుంట అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని బుధవారం అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వీరి నుంచి రూ.36,020 నగదు, పది ద్విచక్ర వాహనాలు, 11 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని, వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

వెంకటాద్రిపల్లి మీదుగా దుర్గానికి బస్సు



వెంకటాద్రిపల్లిలో ఆర్టీసీ బస్సుకు పూజలు చేస్తున్న నాయకులు

బెళుగుప్ప, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కళ్యాణ దుర్గానికి బస్సు సౌకర్యం లేక మండలంలోని వెంకటాద్రిపల్లి, శీర్పి, విరుపాపల్లి, ఎర్రగుడి గ్రామస్థులు ఇబ్బందులు పడేవారు. విషయాన్ని ఇటీవల మంత్రి పయ్యావుల కేశవ దృష్టికి టీడీపీ నాయకులు తీసుకెళ్లారు. మంత్రి ఆర్టీసీ రీజనల్ మేనే జర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. ఉరవకొండ నుంచి వెంకటాద్రిపల్లి, శీర్పి, విరుపాపల్లి మీదుగా కళ్యాణదుర్గానికి బస్సు సర్వీస్‌ను బుధవా రం ప్రారంభించారు. వెంకటాద్రిపల్లిలో టీడీపీ నాయకులు ఆ బస్సుకు పూజలు చేశారు.

కపాస్ కిసాన్ యాప్ రద్దు చేయాలి



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

గుత్తి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కపాస్ కిసాన్ యాప్‌ను రద్దు చేసి.. ఈ క్రాప్ ఆధారంగా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో పత్తికొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్ చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశాడు. స్థానిక మార్కెట్ యార్డులో పత్తికొనుగోలు కేంద్రాన్ని బుధవారం పరిశీలించిన ఆయన మాట్లాడారు. అకాల వర్షాల కారణంగా పత్తిపంట భారీగా దెబ్బతినిందని, గుత్తిలో వారానికి ఒకరోజు మాత్రమే పత్తి కొనుగోలు చేయడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారని అన్నారు. కావున కపాస్ కిసాన్ యాప్‌ను రద్దు చేసి.. వారంలో ఐదు రోజులు పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట జిల్లా సహాయ కార్యదర్శి దస్తగిరి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మల్లేష్, నాయకులు మల్లికార్జున, ఆంజనేయులు, శ్రీనివాసులు, రైతులు ఉన్నారు.